News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :119 | ఖమ్మం | ఆదివారం, జూన్ 15, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## బనకచర్లపై మౌనం ఎందుకు?

- కేంద్రానికి లేఖ రాయని సీఎం.. ఉత్తమ్‌వి ఉత్తుత్తి మాటలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- అఖిలపక్ష సమావేశం పెట్టాలని.. శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్

వివరాలు 2లో..



## హైటెక్స్ వేదికగా గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

### ఉత్తమ నటుడు అల్లు అర్జున్.. సీఎం రేవంత్ చేతుల మీదుగా అవార్డు




- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ
- హైదరాబాద్ హైటెక్స్‌లో వైభవంగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా అవార్డుల అందజేత
- 'పుష్ప-2' చిత్రానికి ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్‌కు పురస్కారం
- ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్ అశ్విన్ (కల్కి)
- ఉత్తమ హిస్టారికల్ ఫిల్మ్‌గా 'రజాకార్', ఉత్తమ తొలి చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'

హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై, చలనచిత్ర రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు కళాకారులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందజేశారు.ప్రముఖ నటుడు అల్లు అర్జున్ 'పుష్ప-2' సినిమాలో కనబరిచిన అద్భుతమైన నటనకు గాను ఉత్తమ నటుడిగా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ అవార్డును అందుకున్నారు. ఆయన నటనకు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఈ అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. ఈ వేడుకలో పలు విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. ఉత్తమ నటిగా నివేదా థామస్ ఎంపికయ్యారు. 2024 సంవత్సరానికి గాను 'కల్కి' చిత్రానికి దర్శకత్వం వహించిన నాగ్ అశ్విన్ ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు. చారిత్రక కథాంశంతో తెరకెక్కిన 'రజాకార్' చిత్రం ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా నిలవగా, 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తొలి చిత్రంగా అవార్డును దక్కించుకుంది. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి

వివరాలు 2లో..

## కాంగ్రెస్ బాటలో బీజేపీ.!!

### ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు

- ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు
- మండే టు ఫ్రైడే స్టేట్ ఆఫీస్ లో అవైలబుల్
- ఏ రోజు ఎవరు ఆఫీసులో ఉంటారో లిస్ట్ రిలీజ్
- గాంధీభవన్ ను ఫాలో అవుతున్న బీజేపీ
- రెండు జాతీయపార్టీలలో నయా ట్రెండ్



హైదరాబాద్: ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, ప్రజలకు చేరువై వారి సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజాప్రతినిధులు పార్టీ ఆఫీసులో అందుబాటులో ఉండేందుకు కాంగ్రెస్ ఎంచుకున్న విధానాన్ని బీజేపీ కూడా ఫాలో అవుతోంది. మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు గాంధీభవన్ లో అందుబాటులోఉంటూ పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరిస్తూ పరిష్కార మార్గాలు చూపుతున్నారు. ఏ రోజు ఎవరు అందుబాటులో ఉంటారనేది ముందస్తుగానే సమాచారం ఇస్తూ వస్తున్నారు. మంత్రులు అందుబాటులో లేని రోజుల్లో కార్పొరేషన్ల చైర్మన్స్ కూడా అర్జీలు స్వీకరిస్తున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు,

వివరాలు 2లో..

## రాజకీయ నిఘా కోసమే ఎస్‌వోటీ

- సిట్ తాజా విచారణలో ప్రభాకర్‌రావు అంగీకారం!
- ప్రణీత్‌రావుకు ప్రత్యేక బాధ్యత అప్పగించానని వెల్లడి
- అనుమతులకు 'మావోయిస్టు' ముసుగు
- ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక మలుపు



ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తుండటంతో కేసులో చిక్కుముడులు వీడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు రాజకీయ నిఘా కోసమే ఎస్ఐబీలో ప్రత్యేక విభాగాన్ని(ఎస్‌వోటీ) ఏర్పాటు చేశానని ప్రభాకర్‌రావు అంగీకరించినట్లు తెలిసింది. ఈ పని చేసేందుకే ప్రణీత్‌రావును ఎస్ఐబీకి తీసుకొచ్చానని చెప్పినట్లు సమాచారం. ప్రధానంగా భారాసకు వ్యతిరేకంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని వారికి సంబంధించిన ఫోన్లలో సంభాషణలను అక్రమంగా వినే ఉద్దేశంతోనే


వివరాలు 2లో..

## గోదావరి-బనకచర్ల వివాదం: వైసీపీ అధినేత జగన్‌ను లాగిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై హరీశ్ ఆరోపణలను ఖండించిన మంత్రి ఉత్తమ్
- ప్రాజెక్టుపై కేంద్రానికి జనవరి 22నే లేఖ రాశామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- తెలంగాణ నీటి హక్కులకు బీఆర్ఎస్సే నష్టం చేసిందని ఆరోపణ
- కృష్ణా జలాల్లో వాటా 299 టీఎంసీలకు పరిమితం చేసింది బీఆర్ఎస్సేనని విమర్శ
- జగన్, కేసీఆర్ అవగాహనతోనే ఏపీకి తెలంగాణ నీళ్లు అందాయని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టాలని భావిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన విమర్శలను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఖండించారు. హరీశ్ రావు వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన కొట్టిపారేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో

వివరాలు 2లో..



## కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం



- కూర్మలో ఆధ్యాత్మిక కేంద్రానికి నిప్పు, భారీ ఆస్తి నష్టం
- దుండగుల పనేనని నిర్వాహకుల ఆరోపణ, దర్యాప్తు ముమ్మరం
- ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- లోతైన విచారణ జరపాలని పోలీసులకు ఆదేశం
- కూర్మ గ్రామ పునరుద్ధరణకు పూర్తి సహాయంపై భరోసా

వివరాలు 2లో..

## సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది

### నారా లోకేశ్ ఎద్దేవా

- వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- 'తల్లికి వందనం' నిధులపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని లోకేశ్ సవాల్
- గడువు ముగిసినా జగన్ రుజువులు చూపలేదని, క్షమాపణ చెప్పలేదని వెల్లడి
- చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- శరణమా, న్యాయ సమరమా తేల్చుకోవాలని జగన్‌కు సూచన

ఏపీ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. జగన్ చేసిన ఆరోపణలపై సవాల్ విసిరితే స్పందన కరవైందని, ఇది ఆయన వైఖరికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు. "సవాల్ చేస్తే సౌండ్ ఆఫ్!" అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "బురద చల్లడం పారిపోయి



వివరాలు 2లో..

## జగన్ పర్యటనలో రాళ్ల దాడి...

### వైసీపీ ఎమ్మెల్యే బూచేపల్లికి నోటీసులు, మరో 15 మంది అరెస్ట్

- ఈ నెల 11న పొదిలిలో పర్యటించిన జగన్
- వైసీపీ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడికి పాల్పడినట్టు ఆరోపణలు
- ఎమ్మెల్యే బూచేపల్లికి పోలీసుల నోటీసులు, కొనసాగుతున్న అరెస్టులు



వివరాలు 2లో..

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితం

- పదేళ్ల తర్వాత ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకం: మంత్రి పొన్నం
- రూ. 5 లక్షల ప్రభుత్వ సాయం.. అవసరమైతే మహిళా సంఘాల నుంచి అదనంగా లక్ష రుణం
- 400 నుంచి 600 చదరపు అడుగుల్లో ఇల్లు కట్టుకోవాలన్న మంత్రి

వివరాలు 2లో..





### వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే

## ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తా

- తల్లికి వందనంపై వైసీపీ ఆరోపణలు
- రూ.13 వేలు ఇచ్చి మిగతా రూ.2 వేలు లోకేశ్ జేబులోకి వెళ్లాయని ఆరోపణ
- తీవ్రంగా స్పందించిన మంత్రి సవిత
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని ఫైర్

వివరాలు 2లో..

# బనకచర్లపై మౌనం ఎందుకు?

ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోకుండా కాంగ్రెస్, భాజపాలు మౌనం దాల్చడం వెనుక కారణం ఏంటని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర జల సంఘం భాగస్వామ్య రాష్ట్రాలకు పంపిందని, ఈ నెలాఖరున ఏపీ టెండర్లు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నా నిలువరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని భారాస ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో బనకచర్ల ప్రాజెక్టుతోపాటు పలు అంశాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను తరలించినట్లుగానే బనకచర్లతో గోదావరి జలాల విషయంలో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

"కేటీఆర్‌పై కేసులు పెట్టడం, ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేయడం, నిత్యం ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేయడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు. నాడు బాబ్లీ విషయంలో రెండు టీఎంసీల కోసం మహారాష్ట్రతో చంద్రబాబు పోరాటం చేశారు. గోదావరి బోర్డు, ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఏపీ నిర్మిస్తున్న 200 టీఎంసీల అక్రమ ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి ఎందుకు పోరాటం చేయడం లేదు? పాత దోస్తానాలు, బంధాలు, గురు దక్షిణ కోసం మౌనంగా ఉంటున్నారా? నాడు కాళేశ్వరంతోపాటు పలు ప్రాజెక్టులను అడ్డుకోవాలంటూ ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసింది. ఇప్పుడు బనకచర్లపై కేంద్రానికి తెలంగాణ సీఎం ఎందుకు లేఖ రాయడం లేదు?8 మంది భాజపా ఎంపీలు ఉండీ ఎందుకు స్పందించడం లేదు? నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌వి ఉత్తుత్తి మాటలే తప్ప చేతలు లేవు. నేను గతంలో ఆరోపణలు చేస్తే పాత తేదీతో లేఖ రాసి విడుదల చేశారు. ఇప్పుడు కూడా నేను ప్రజంటేషన్ ఇవ్వడంతో ముందు రోజు తేదీ వేసి లేఖ రాశారు. గత నెల 23న ఏపీ.. సీడబ్ల్యూసీకి లేఖ రాసింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాత్రం తమకు ప్రాజెక్టు వివరాలేవీ రాలేదని కిందటి నెల 28న లేఖ రాశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. శాసనసభను సమావేశపరచాలి. తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. లేదంటే భారాసనే ప్రజాపోరాటానికి దిగుతుంది. న్యాయపోరాటం చేస్తుంది. కాళేశ్వరం రుణాలకు పరిమితి విధించి కోత వేసిన కేంద్రం ఏపీలోని పోలవరానికి నిధులు భరిస్తూనే.. రుణ పరిమితిని ఎత్తివేస్తామని చెప్పింది. తెలంగాణకు ఒక న్యాయం... ఏపీకి ఒక న్యాయమా? రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు సహా ఎనిమిది మంది భాజపా ఎంపీలు ఉండీ ఎందుకు స్పందించడం లేదు? 200 టీఎంసీల గోదావరి జలాలను బనకచర్లకు తీసుకువెళ్తే ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం ఎగువ రాష్ట్రాలకు వాటా రావాలి. పోలవరం నుంచి మళ్లింపునకు సంబంధించిన వాటా కూడా కలిపితే తెలంగాణకు 157.5 టీఎంసీలు రావాలి కదా... ఎందుకు రాష్ట్రం ప్రశ్నించడం లేదు? కృష్ణా జలాల వినియోగం, పరిరక్షణలోనూ ప్రభుత్వం విఫలమైంది. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ లైనింగ్‌ను అడ్డుకోలేక పోతోంది" అని హరీశ్‌రావు విమర్శించారు.

# రాజకీయ నిఘా కోసమే ఎస్‌వోటీ

- మొదటి పేజి తరువాయి

ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్(ఎస్‌వోటీ) విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు సిట్‌కు వివరించినట్లు తెలిసింది. కేవలం రాజకీయ నిఘా కోసమే ఈ విభాగం పనిచేసిందని తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇదంతా ఎవరి ప్రోద్బలంతో చేయాల్సి వచ్చిందనే కోణంలో సిట్ తాజాగా దర్యాప్తు చేస్తోంది. తగిన ఆధారాలు లభిస్తే రాజకీయంగా సంచలనాలు వెలుగు చూసే అవకాశం కనిపిస్తోంది. ప్రభాకర్‌రావును ఇప్పటికే రెండు విడతలుగా విచారించిన సిట్.. శనివారం మూడో విడత సుదీర్ఘంగా మాట్లాడి వివరాలు రాబట్టింది.

**డబ్బులు.. ఔషధాలు.. ఆయుధాలు..**

ముఖ్యంగా 2023 శాసనసభ ఎన్నికలకు ముందు భారాసకు వ్యతిరేకంగా ఉన్న వారితో సహా ఇతర ప్రముఖుల ఫోన్లపై ఎస్‌వోటీ నిఘా ఉంచేందుకు అనుమతులెలా వచ్చాయని సిట్ ఆరా తీయడంతో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిఘా ఉంచాల్సిన ఫోన్ నంబర్ల జాబితాలు.. డిజిగ్నేటెడ్ అథారిటీ హోదాలో ప్రభాకర్‌రావు పేరుతోనే ఉన్నతాధికారులకు వెళ్లేవి. ఆ ఫోన్ నంబర్లపై ఎందుకు నిఘా ఉంచాలని తెలిపే సమయంలో 'మావోయిస్టు' ముసుగు వాడారు. మావోయిస్టులకు డబ్బులు, ఔషధాలు, ఆయుధాలు సరఫరా చేస్తున్నారంటూ ప్రముఖులందరికీ ముద్ర వేశారు. ఉన్నతాధికారులూ ఆ ఫోన్ల జాబితాలకు ఆమోదం తెలిపారు. అనంతరం ప్రభాకర్‌రావు బృందం ఆ జాబితాలనే సర్వీస్ ప్రొవైడర్లకు పంపింది. అలా విన్న ఫోన్ల కాల్ రికార్డులను నిక్షిప్తం చేసిన హార్డ్‌డిస్క్‌లనే ఎన్నికల ఫలితాల తర్వాత ధ్వంసం చేసింది.

**ప్రణీత్‌రావు పొరపాటు.. ప్రభాకర్‌రావుకు గ్రహపాటు**

ప్రణీత్‌రావు చేసిన పొరపాటు ప్రభాకర్‌రావుకు గ్రహపాటుగా మారినట్లు కనిపిస్తోంది. 2023 డిసెంబరులో ప్రభాకర్‌రావు బృందం తమ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలోని డేటాను పకడ్బందీగా డిలీట్ చేసింది. మరోవైపు ఈ బృందం ధ్వంసం చేసి మూసీలో పడేసిన హార్డ్‌డిస్క్‌లను వెలికితీసి ఎఫ్ఎస్ఎల్ ద్వారా విశ్లేషించినా విలువైన సమాచారమేదీ లభ్యం కానట్లు తెలిసింది. అయితే ప్రణీత్‌రావు 2023 జూన్ వరకు తాను వినియోగించిన ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడం మరిచిపోయారు. ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణ క్రమంలో ఆ ఫోన్‌లో సేవ్ చేసిన రాజకీయ నేతల సంభాషణలు తాజాగా సిట్ చేతికి అందాయి. భాజపాలో ఉన్న ఒక మాజీ ఎంపీ, అలాగే సిద్దిపేటకు చెందిన ఒకరి సంభాషణలు ఆ ఫోన్‌లో బహిర్గతమయ్యాయి. దీంతో రాజకీయ నిఘా జరిగిందనేందుకు కీలక ఆధారాలు లభ్యమైనట్లయింది. ప్రస్తుతం వీటి గురించి ప్రభాకర్‌రావు సమాధానం చెప్పాల్సి ఉంది.

**నేటి నుంచి బాధితుల వాంగ్మూలాల నమోదు**

సిట్ అధికారులు శనివారం ప్రభాకర్‌రావును సుమారు 9 గంటలపాటు విచారించారు. ఈనెల 17న మరోసారి విచారణకు రావాలని ఆదేశించారు. ఆయన సెల్‌ఫోన్లను జప్తు చేయాలని సిట్ నిర్ణయించింది. మరోవైపు ఆదివారం నుంచి బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయనుంది.

# గోదావరి-బనకచర్ల వివాదం: వైసీపీ అధినేత జగన్‌ను లాగిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం పూర్తి నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై మా అభ్యంతరాలను వివరిస్తూ ఈ ఏడాది జనవరి 22వ తేదీనే కేంద్ర జలశక్తి శాఖ మంత్రికి, ఆర్థిక శాఖ మంత్రికి స్వయంగా లేఖ రాశాను. ఈ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మౌనం వహించలేదు, చట్టపరంగానే మా పోరాటాన్ని కొనసాగిస్తున్నాం" అని ఆయన వివరించారు. తెలంగాణ నదీ జలాల హక్కులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే తీవ్ర నష్టం కలిగించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. "కృష్ణా నదిలో తెలంగాణ వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేసి రాష్ట్రానికి అన్యాయం చేసింది బీఆర్ఎస్ కాదా? వారి హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి ఏపీకి నీటిని తరలించారు. అప్పుడు రాయలసీమ ఎత్తిపోతల పథకంపై అపెక్స్ కౌన్సిల్‌ను ఎందుకు సంప్రదించలేదు?" అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రోజూ మూడు టీఎంసీల నీటిని తరలిస్తుంటే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. "జగన్, కేసీఆర్ మధ్య ఉన్న అవగాహనతోనే తెలంగాణకు రావాల్సిన నీటిని ఏపీకి దోచిపెట్టారు" అని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# హైటెక్స్ వేదికగా గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

- మొదటి పేజి తరువాయి

బాలకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

**మీకేం కావాలో చెబితే.. ప్రభుత్వ సహకారం**

నటులు, కళాకారులు, దర్శకులు.. ఇలా అందరినీ గౌరవించాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. సినీ పరిశ్రమలో తొలి తరం.. అన్న ఎన్టీఆర్, ఏయన్నార్, రెండోతరంలో.. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు.. మూడోతరంలో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి కథనాయకులు వచ్చారు. నేడు నాలుగోతరంలో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ వంటి వారున్నారు. వీరంతా పరిశ్రమలో రాణిస్తున్నారు. బన్నీ, వెంకట్, అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్‌అశ్విన్ ఇలా చాలామంది నాకు కాలేజీ రోజుల నుంచి తెలుసు. మా యువమిత్రులు పరిశ్రమలో రాణించడం.. వారిని నేను అభినందించడం సంతోషకర సందర్భం.

తెలంగాణ రైజింగ్- 2047 నినాదంతో ముందుకు వెళుతున్నాం. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే ఆ సమయానికి ప్రపంచాన్ని శాసించే ఆర్థిక వ్యవస్థగా దేశం అభివృద్ధి చెందాలి. ఐటీ, ఫార్మా, రక్షణ, సినీ పరిశ్రమలు గొప్పగా రాణించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ స్థాయికి అభివృద్ధి చేస్తామని ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీకి చెప్పా. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సినీ పరిశ్రమ గొప్పగా అభివృద్ధి చెందాలి. హాలీవుడ్ అంటే అమెరికాకు, బాలీవుడ్ అంటే ముంబయికి వెళ్తున్నారు. దర్శకుడు రాజమౌళిని అడుగుతున్నా.. ప్రపంచం గుర్తించేలా మీరు అద్భుతమైన సినిమాలు తీస్తున్నారు.. హాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమను ఈ గడ్డకు ఎందుకు తీసుకురావడం లేదు? ఆ పరిశ్రమల వారు కూడా హైదరాబాద్ గడ్డపై షూటింగ్‌లకు రావాలి. అందుకోసం మీకేం కావాలో చెబితే ప్రభుత్వం అండగా ఉంటుంది.

**తెలంగాణ విజన్ 2047లో చిత్ర పరిశ్రమకు చాప్టర్**

తెలంగాణ ప్రభుత్వ 2047 విజన్ డాక్యుమెంట్‌లో చలనచిత్ర పరిశ్రమకు ఒక చాప్టర్ ఇస్తాను. నేను మరో 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. ఏ హోదాలో ఉన్నా.. మీకు అండగా నిలుస్తా. చిత్ర పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు, సహకారం అందిస్తాం. ప్రపంచంలోని ఫార్చ్యూన్-500 కంపెనీల్లో 85 తెలంగాణ గడ్డపైనే ఉన్నాయి. దేశంలో ఏ నగరంలోనూ ఇన్ని కంపెనీలు లేవు. బెంగళూరు, అమరావతి, ముంబయి, చెన్నై.. ఈ నగరాలేవీ హైదరాబాద్‌కు పోటీ కాదు.. మా పోటీ న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతోనే. పరిశ్రమల్లో చైనాతో పోటీ పడాలన్నది మా ఆలోచన.

**గద్దరన్న అంటే చైతన్యం**

గద్దరన్న ఒక విప్లవం, చైతన్యం, వేగుచుక్క. ఆయన స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నాం. ఆయన స్ఫూర్తితోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్నాం. తెలంగాణ పురోగతిలో చిత్ర పరిశ్రమ భాగం కావాలి. గతంలో ఏమైనా అంశాలున్నా వాటిని పక్కన పెట్టండి. అందరం కలిసి అభివృద్ధి వైపు నడవాలి. గద్దరన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేస్తున్నా.. పాతబస్తీ వాసి రాహుల్ సిప్లిగంజ్ సంగీత రంగంలో అద్భుతంగా రాణిస్తున్నారు.

## సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది

- మొదటి పేజి తరువాయి

ప్యాలెస్‌లో దాక్కోవడం జగన్ గారికి అలవాటు. తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వెళ్ళాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని ఛాలెంజ్ చేసాను. సమయం ముగిసింది, రుజువు చెయ్యలేదు, క్షమాపణ కోరలేదు. అందుకే మిమ్మల్ని ఫేకు జగన్ అనేది. లీగల్ యాక్షన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమరమా? తేల్చుకోండి" అంటూ జగన్‌కు లోకేశ్ అల్టిమేటమ్ జారీ చేశారు.ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు, మిగతా రూ.2 వేలు పాఠశాలలు/కాలేజీల అభివృద్ధి నిధుల నిమిత్తం ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే, ఈ రూ.2 వేలు మంత్రి నారా లోకేశ్ జేబులోకి పోతున్నాయంటూ వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేశ్ సవాల్ విసిరారు.

## బీసీ ఉపాధ్యాయులకు క్రీమీలేయర్ ఎత్తివేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మహాత్మా ఫులే ప్రతిభా పురస్కారాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 180 మంది విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఎస్ఎస్‌సీ పరీక్షల డైరెక్టర్ జనరల్ కృష్ణారావు, బీసీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, జాక్టో ఛైర్మన్ సదానందంగౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## 'దాడులు కొనసాగితే.. టెహ్రాన్ శిథిలమవుతుంది'..

- మొదటి పేజి తరువాయి

ప్రయోగించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ఇరాన్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఇరాన్ తమ దేశంపై క్షిపణులను ప్రయోగించడం కొనసాగిస్తే.. టెహ్రాన్ తగలబడిపోతుందని హెచ్చరించారు. పౌర నివాసాలపై దాడులు చేసి..వారికి హాని తలపెట్టాలని చూస్తే..ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఖమేనీ తన చర్యలతో తన దేశంలోని ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని అన్నారు.

**టెహ్రాన్‌పై దాడులకు వైమానిక దళం సిద్ధం: ఐడీఎఫ్**

ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై తిరిగి దాడులు చేయడానికి తమదేశ వైమానిక దళం సిద్ధంగా ఉందని ఐడీఎఫ్ తెలిపింది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్, ఇజ్రాయెల్ వైమానిక దళ చీఫ్ మేజర్ జనరల్ టోమర్ బార్ పరిస్థితులను అంచనా వేస్తున్నట్లు సమాచారం. కాగా టెల్అవీవ్‌పై టెహ్రాన్ చేస్తున్న దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

**అమెరికా, ఫ్రాన్స్, యూకే స్థావరాలపై దాడులు చేస్తాం: ఇరాన్**

తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే పశ్చిమాసియాలోని ఆయా దేశాల స్థావరాలను, నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. తమపై దాడులకు పాల్పడుతున్న టెల్అవీవ్‌కు వాషింగ్టన్ మద్దతునిస్తుందని ఇప్పటికే ఇరాన్ అధికారులు ఆరోపించిన విషయం

తెలిసిందే. కాగా అవన్నీ తప్పుడు ప్రచారాలని అగ్రరాజ్యం కొట్టిపడేసింది.

ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ గురువారం అర్ధరాత్రి భీకరమైన దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలు కీలక మిలిటరీ అధికారులు, అణుశాస్త్రవేత్తలు మృతి చెందారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా భారీ దాడులకు దిగింది. శుక్రవారం అర్ధరాత్రి టెల్ అవీవ్, జెరూసలెం లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఆయా ప్రాంతాల్లో డజన్ల కొద్దీ క్షిపణి దాడులు చేసింది. శనివారం ఇరుదేశాలు మళ్లీ ఒకదానిపై ఒకటి డ్రోన్లతో విరుచుకుపడ్డాయి.

# కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం

శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలో ప్రశాంతతకు భంగం వాటిల్లింది. ఆధ్యాత్మిక చింతనతో, ప్రకృతి ఒడిలో జీవనం సాగించే ఈ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలు జరిగాయని మందిర నిర్వాహకుల్లో ఒకరైన ప్రభుదాస్ పోలీసులకు వివరించారు.ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం అని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు.

"ఆధునిక హంగులు లేకుండా అధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరం. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలోని కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేశాను. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలి. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్ళల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలి" అని పవన్ స్పష్టం చేశారు.

## జగన్ పర్యటనలో రాళ్ల దాడి...

: ప్రకాశం జిల్లా పొదిలిలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యట న సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా, మరో 15 మంది వైసీపీ కార్యకర్తలను అరెస్ట్ చేశారు.

ఈనెల 11వ తేదీన మాజీ జగన్ పొదిలి పర్యటనకు వచ్చినప్పుడు శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిందని పోలీసులు గుర్తించారు. వైసీపీ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. జగన్ పర్యటన రోజున వైసీపీ కార్యకర్తలు బారికేడ్లను తొలగించి బలవంతంగా తోసుకుని వచ్చారని పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే బూచేపల్లికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వాహనాలు హెలీప్యాడ్ వరకు వచ్చాయని, పట్టణంలో శాంతియుతంగా ఉన్న ఇతర పార్టీల కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడికి ప్రయత్నించి చెప్పులు, రాళ్లు విసిరారని నోటీసులో పేర్కొన్నట్టు వివరించారు. ఈ దాడుల్లో పోలీసులు కూడా గాయపడ్డారని, వారి విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. పొగాకు బోర్డు కార్యాలయంలోకి కూడా కార్యకర్తలు చొరబడి బేళ్లను తొక్కి ఆస్తినష్టం చేశారని ఆరోపించారు. జరిగిన ఘటనలకు బాధ్యత వహించాల్సిన స్థాయిలో ఉన్నందున, మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యేను నోటీసు ద్వారా కోరినట్లు సీఐ వివరించారు.

## వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తా

తల్లికి వందనం పథకంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే తాను ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా చేయగలరా? అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత సవాల్ విసిరారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.'తల్లికి వందనం' పథకం కింద కేటాయించిన నిధులలో రూ.2 వేలు నారా లోకేశ్ జేబుల్లోకి వెళ్లాయని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి సవిత ఘాటుగా స్పందించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని, కానీ ప్రజలు ఇప్పటికే వారిని పక్కనపెట్టారని, ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు.

**'తల్లికి వందనం'తో తల్లుల ఖాతాల్లోకి నేరుగా నిధులు**

ఎన్డీయే ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని సవిత తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల 27 వేల 164 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా రూ.8,745 కోట్లు జమ చేశామని, దీంతో తల్లిదండ్రులు, పిల్లలు సంతోషంగా ఉన్నారని వివరించారు.

ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తుండగా, అందులో రూ.2 వేలు పాఠశాల అభివృద్ధికి, మిగిలిన రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. "ఇంట్లో ఒకరుంటే రూ.13 వేలు, ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, ఐదుగురుంటే రూ.65 వేలు అందజేశాం. ఒక కుటుంబంలోని ముగ్గురు ఆడబిడ్డలకు ఈ పథకం అందడంతో వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు" అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ కూడా ఈ పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమని, ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల కృషి ఎనలేనిదని ప్రశంసించారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితం

:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త తెలిపారు. ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయం గురించి వివరిస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు.

"ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 8 ట్రాక్టర్ల ఇసుకను ఉచితంగా అందించడంతో పాటు విడతల వారీగా రూ. 5 లక్షలు అందజేస్తున్నాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఉండాలని ఆయన సూచించారు.లబ్ధిదారులకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణం ఇప్పించే ఏర్పాటు కూడా ప్రభుత్వం చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. "పది సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, ఇప్పుడు ప్రజా పాలన ప్రభుత్వంలో మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి" అని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ బాటలో బీజేపీ.!! ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు

- మొదటి పేజి తరువాయి

పింఛన్లు, రేషన్‌కార్డులు, వైద్య సాయం, భూములు, రెవెన్యూ సంబంధిత సమస్యలపై వినతులు వస్తున్నాయి. విజ్ఞాపనలు అందించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న ప్రజలు గాంధీభవన్ వద్ద క్యూ కడుతున్నారు. ప్రజల్లో ఉండేందుకు ఈ ఫార్ములా కరెక్ట్ అని భావిస్తున్న కమల నాథులు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఏ రోజు ఏ ప్రజాప్రతినిధి అందుబాటులో ఉంటారనే అంశాలను వెల్లడిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం మొదటి అంతస్తులోని రూం నంబర్ 102లో ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని తెలిపింది. ఈ నెల 16(సోమవారం) నుంచి అందుబాటులో ఉంటారని తెలిపింది. 16న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, 17న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, 18న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, 19న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, 20న రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య అందుబాటులో ఉంటారని తెలిపింది.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబం కి ఇన్సూరెన్స్ చెక్కు అందజేసిన బాణోత్ మంజుల మదన్ లాల్



**జూన్ 14 ( సీ కే న్యూస్)** ఇటీవల వైరా శాంతినగర్ కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎక్కిరాల వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ 2 లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును మంజూరు చేసింది. శనివారం ఆ చెక్కును ఖమ్మం లో స్వర్గీయ వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ నివాసం నందు బాణోత్ మదన్ లాల్ సతీమణి బాణోత్ మంజుల మదన్ లాల్ బాధిత కుటుంబ సభ్యులకు 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమం లో మాజీ వైస్ ఎంపీపీ తన్నీరు జ్యోతి, కొత్తా వెంకటేశ్వరావు,కిలరి కిరణ్,అప్పు సురేష్,మేదరమేట్ల రాము,తన్నీరు కిషోర్,అందులోని ప్రేమ్,నల్లబొలు వెంకట రెడ్డి తదితరులు ఉన్నారుద

## లోతుకుంట గ్రామంలో అంగన్వాడి బడిబాట కార్యక్రమం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 14.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని లోతుకుంట గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించినారు,రెండు సంవత్సరాల నుండి మూడు సంవత్సరాలు మరియు నాలుగు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రానికి పంపియ్యాలని, సూపర్వైజర్ బాలమణి మరియు టీచర్ విజయ లోతుకుంట గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తల్లులను కోరడం జరిగింది,కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పోషక పదార్థాలను వాటి గురించి అవగాహన తల్లులకు చెప్పడం జరిగింది,అంగన్వాడి పిల్లల ఎదుగుదలను మరియు వారికి ఇచ్చే పోషక లను గురించి తల్లులకు వివరించడం జరిగింది,కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వము అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే పోషక పదార్థాల ను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన సదస్సులో కోరడం జరిగింది, ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బాలమని టీచర్ విజయ హెచ్ఎం ప్రవీణ్ గ్రామ పెద్దలు లింగయ్య నరసింహ నవీను సుభాష్ చంద్రబోస్ గ్రామంలోని అంగన్వాడి సిబ్బంది తల్లులు పాల్గొన్నారు.

## రైతులతో చేలగటం ఆడుతున, జీవిక, జిఎం అశోక్ శర్మ



**జూన్ 14 ( సీ కే న్యూస్) చేగుంట :** చేగుంట మండల్ అనంతసాగర్ గ్రామ శివారులో గల జీవిక పరిశ్రమ వివరాల్లోకి వెళితే జీవిక పరిశ్రమ జిఎం అశోక్ శర్మ, పరిశ్రమ చుట్టూ ప్రావారి గోడ నిర్మిస్తూడడంతో,చుట్టూ పక్కల ఉన్న రైతులు మా పొలాల వద్దకు దారి ఇవ్వలని కోరగా,వారు స్పందించకపోవడం రైతులు ఆందోళన చేపట్టారు, అనంతరం దారి కోసం రైతులతో కంపెనీ యజమాన్యం జిఎం అశోక్ శర్మను, పదాలను కూడా పట్టుకున్నారు, అయిన జీయం చర్మకు రైతులపై ప్రేమ చూపలేదు, ఈ ఘటన చర్చనీయమైన అంశం. రైతులు మాట్లాడుతూ జీవిక ఐరన్ పరిశ్రమ నిర్మించక ముందే చేగుంట,అనంతసాగర్, గ్రామానికి చెందిన రైతులు, తమ పొలాలకు వెళ్లే దారి గత 50 సంవత్సరాలు నుండి ఉండగా, ఇప్పుడు కంపెనీ వారు తమ పొలాలకు, వ్యవసాయం చేసుకోవడానికి తమకు దారి ఇవ్వాలని, రైతులు నేడు రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేపట్టారు, రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి, రైతులు నర్సింలు అన్నారు, విషయం తెలుసుకున్న చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, ఊట ఊటిన అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు పులబోయిన భూపాల్, బక్క నర్సింలు, ముత్యాలు,బండి నరసింహులు, గంగులు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 14,** ఈ నెల 16 సోమవారం జరుగు రైతు నేస్తం కార్యక్రమం లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారని, ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. సోమవారం నిర్వహించి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడునున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 58 రైతువేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సోమవారం అన్ని రైతు వేదికలను పండుగ వాతావరణం లో మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకే రైతు వేదిక వద్దకు రైతులు చేరుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆడియో మరియు వీడియోలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా సరిచూసుకోవాలని ఏవైనా సమస్యలు ఉంటే రేపటిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు వేదికలకు విచ్చేసే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలను పలకాలని అధికారులకు సూచించారు. ప్రతి రైతు వేదికలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో ఎంత మంది రైతులకు ఎంత మొత్తంలో రైతు భరోసా జమ అవుతున్నదో వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు వేదికలకు పెద్ద ఎత్తున రైతులు హాజరవుతారు కాబట్టి, రైతు వేదికల వెలుపల ఏబిసిడి డ్రైవ్ పై అవగాహన కల్పించే విధంగా స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమానికి రైతు వేదిక పరిధిలో మునగ సాగు చేపట్టి లబ్ధి చేకూరిన రైతులను ఆహ్వానించి వారి ద్వారా ఇతర రైతులకు మునగ సాగు ద్వారా వచ్చే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీఎంలు కూడా హాజరు కావాలని, దాని ద్వారా వారు మహిళా సమైక్య సభ్యులకు అజోల్ల పెంపకం, బయోచార్ తయారీ, చేపల పెంపకం తదితర వాటిపై సభ్యులకు అవగాహన కల్పించడం ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని కలెక్టర్ సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో దేశం మొత్తం జిల్లా వైపు చూస్తుందని దీనికి సహకరించిన ప్రతి అధికారి, ఉద్యోగస్తులను కలెక్టర్ అభినందించారు. రానున్న వర్షాకాలంలో ఎక్కడైతే వర్షం నీరు నిలుస్తుందో అక్కడ వెంటనే ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.




## సింగరేణి కాంటాక్ట్ కార్మికులందరికీ హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ అకౌంట్ అమలు చేయాలి

**ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి సలగల రమేష్ కి వినతి.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / మణుగూరు, ప్రతినిధి,జూన్ 14,** సింగరేణి కాంటాక్ట్ కార్మికులందరికీ హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఎకౌంటు అమలు చేయాలని ఖాతాలో వేతనాలు జమ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం సాయంత్రం ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా అధికార ప్రతినిధి సలగల రమేష్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులందరికీ హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి చేసిన ఎండి ఆదేశాలు మణుగూరు లో పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు ఇంకా అనేకమంది కాంట్రాక్టర్లు ఏదో ఒక సాకు చెబుతూ మీనమేషాలు లెక్క వేస్తున్నారనీ కాలయాపన చేస్తున్నాతన్నారు హెచ్ డి ఎఫ్ సి బ్యాంకుతో సింగరేణి యాజమాన్యం చేసుకున్న ఒప్పందం ప్రకారం దురదృష్టవశాత్తు ఎవరైనా కాంట్రాక్ట్ కార్మికులు ప్రమాదానికి గురైతే వారి వైద్యానికి కానీ లేదా వారి కుటుంబానికి ఆసరాగా ఉండే విధంగా ప్రమాద భీమా ముప్పయి లక్షల రూపాయల ఒప్పందం అమల్లో ఉందనీ. మణుగూరు ఏరియాలో అన్ని విభాగాల కాంటాక్ట్ కార్మికులందరికీ హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి చేయాలి దీనికై ఏరియా యాజమాన్యం చొరవ చూపాలని కోరారు అదేవిధంగా విధి నిర్వహణలో ప్రమాద బీమా తో పాటు బయట ప్రమాదాలకు కూడా వర్తించే విధంగా వైద్యానికి లేదా వారిని నమ్ముకున్న కుటుంబాలకు ఆసరాగా నిలబడే విధంగా ప్రమాద భీమా విస్తరింప చేయాలనీ ఆయన సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.

## పిడుగు పడి సింగరేణి కాంటాక్ట్ కార్మికుడు కుంజా జగన్ (40 ) మృతి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 14,** ఐ ఎఫ్ టి యు నాయకుల సంతాపం ప్రభుత్వం స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

శనివారం సాయంత్రం రేవుల గండి సమీపంలో పిడుగు పడి చనిపోయిన సింగరేణి కాంటాక్ట్ కార్మికుడు రేగుల గండి నివాసి మూలవాసి కుంజా జగన్ (40) మృతి పట్ల ఐ ఎఫ్ టి యు నాయకులు యస్ డి నా సర్ పాషా, అంగోత్ మంగీలాల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూనవరం అడ్డాలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న జగన్ శనివారం నాడు విధులు ముగించుకుని తన వ్యవసాయ భూమిలోకి వెళ్తున్న సమయంలో సాయంత్రం సమయంలో పిడుగు పడి చనిపోవడం అత్యంత బాధాకర సంఘటనగా వారు





అభివర్ణించారు. ఆయనకు భార్య నలుగురు పిల్లలు ఉన్నారని జగన్ మృతితో వాళ్ళందరూ దిక్కులేని వారయ్యారని విచారం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా జగన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేయడంతో పాటు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జగన్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మిడిదొడ్ల నాగేశ్వరరావు, నల్లా రమేష్, బత్తుల లక్ష్మణ్ , రాంబాబు వెంకన్న, ఆదిలక్ష్మి, రుక్మిణి, అనసూర్య, వెంకటలక్ష్మి ,కంది లక్ష్మి ,కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సుంకిశాలలో అంబరాన్నంటిన గ్రామదేవతల పండుగ సంబరాలు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 14.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో కట్ట మైసమ్మ తల్లి. పోచమ్మతల్లి. ఈదమ్మతల్లి. పండుగలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయానికి చేరుకొని బోనాలు ఒడిబియ్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం పలువురు మాట్లాడుతూ గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో చల్లగా ఉండాలని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చెరుకు శివయ్య గౌడ్ పైళ్ల ఆనంద్ రెడ్డిమొగిలిపాక నరసింహ ఈతాప రాములు కొండల్ రెడ్డి కొమ్మగాని జంగయ్య కాటెపల్లి ఉపేందర్ మంగ జగన్ కవిడే కిష్టయ్య. వెంకట్ రెడ్డి యువకులు. మహిళలు తదితరులు పాల్గొన్నారు

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఖాకీ చొక్కాల పంపిణీ

- ఆటో డ్రైవర్లకు అందజేసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్
- సద్వినియోగం చేసుకోవాలని పిలుపు
- పాల్గొన్న ఐఎన్ టీయూసీ నేతలు, కాంగ్రెస్ శ్రేణులు
- నగరంలోని వివిధ అడ్డాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

**సి కె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం:** ఆటో డ్రైవర్లకు యూనిఫాం కోసం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి ఆర్థిక తోడ్పాటుతో ఖాకీ చొక్కాలను సిద్ధం చేయించారు. ఈ క్రమంలో నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో పలువురు ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ శనివారం పంపిణీ చేశారు. పలు అడ్డాలకు సంబంధించి ఐఎన్ టీయూసీ నుంచి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలిరాగా.. వారందరికీ ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, నగర అధ్యక్షులు నరాల నరేష్ లతో కలిసి కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ఖాకీ చొక్కాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ ప్రత్యేక చొరవతో ఇస్తున్న వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందని చెప్పారు. కార్మికులు, కర్షకుల కోసం అనేక పథకాలు అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ నాయకులు పాల్వంచ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు అడ్డాల నుంచి ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరూ పాల్గొని "ప్రతీ అడుగు పచ్చదనం" చేయాలి.

- 45 లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలి
- "నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో 60 చెరువుల నిర్మాణం పూర్తి.
- చిన్న తరహా పరిశ్రమల సౌకర్యం కోసం హైదరాబాద్ కు సమీపంలో బొగ్గు విక్రయ కేంద్రం ఏర్పాటు కు యోచన.
- అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల సమావేశంలో సింగరేణి సీ ఎం డీ ఎన్. బలరామ్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 14,**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ "ప్రతీ అడుగు పచ్చదనం" నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతుందని, దీనిలో అధికారులు, ఉద్యోగులు, స్థానికులు అందరూ పాల్గొనేలా ప్రత్యేక చొరవ చూపాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ ఆదేశించారు. శనివారం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జనరల్ మేనేజర్లతో వివిధ అంశాల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనిని విజయవంతం చేయడం కోసం ప్రతీ ఒక్కరూ తమకు సాధ్యమైనన్ని మొక్కలు నాటే విధంగా చొరవ చూపాలని కోరారు. "నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మినీ చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60 చెరువులు పూర్తవడం సంతోషకరమని, మిగిలిన చెరువులు కూడా మరో వారం లోపు పూర్తి చేయాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని నిర్ణయించామని, వీటిలో ఇప్పటికి కేవలం నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. కనుక మిగిలినవి త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై సింగరేణి సంస్థ నుండి జి 14, జి 15 గ్రేడు గల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపివేయాలని, దానికి బదులు జి 13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయటానికి తగు ఏర్పాటు చేయాలని జనరల్ మేనేజర్లను ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తమకు కావలసిన తక్కువ మోతాదు బొగ్గును సింగరేణి ఏరియాలకు వచ్చి తీసుకువెళ్లడం అంత వెసులుబాటు కావడం లేదని గమనించబడిందని, వీరి సౌకర్యం కోసం హైదరాబాదుకు సమీపంలో ఒక బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులని ఆదేశించారు.
భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనులలో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుండి ఇసుక సేకరణకు గాను వెంటనే క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలన్నారు.
ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, జనరల్ మేనేజర్ సి పి పి ఏ. మనోహర్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్.వి. రాజశేఖర్ రావు, కార్పొరేట్ నుండి వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, ఏరియాల్లోని జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# లోక్ అదాలతో రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లే

న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్) జూన్ 14,**ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం ఇల్లందు మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజిపడదగిన, మనోవర్తి, గృహింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసులు ఇట్టి కేసులలో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజి కుదుర్చుకున్నట్లైతే ఇరువర్గాలు గెలిచినట్లే అవుతుందన్నారు. తద్వారా ఎంతో విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చునని, అంతేకాకుండా ఒకసారి లోక్ అదాలత్ లో రాజీ పడినట్లయితే పైకోర్టుకు వెళ్లి అప్పీల్ అవకాశం ఉండదని, కక్షిదారులు గ్రామస్థాయిలో పెద్దమనుషుల సమక్షంలో రాజి చేసుకున్న కేసులలో వారు చేసే అగ్రిమెంట్లకు చట్టబద్ధత ఉండదని, కోర్టుకు వచ్చి లోక్ అదాలత్ ద్వారా రాజీ పడినట్లయితే చట్టబద్ధత ఉంటుందని, కక్షిదారులు పంతాలకు పోకుండ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. అనంతరం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి చేతుల మీదుగా కక్షిదారులకు మొక్కలు పంపిణీ చేసి విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరి వెంకట నరసయ్య, పప్పుల గోపీనాథ్, దంతాల ఆనంద్, ఎస్, వెంకటేశ్వర్లు, జూనియర్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.ద

# టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు ను సన్మానించిన టెలికాం బోర్డు సభ్యులు బోదాసు కనకరాజు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జూన్ 14,**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నియమితులైన నాగా సీతారాములు ను టెలికాం బోర్డు సభ్యులు బోదాసు కనకరాజు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అండగ ఉండు పార్టీని అభివృద్ధి చేసేందుకు కృషి చేసిన టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు కు అధిష్టానం ప్రధాన కార్యదర్శి అవకాశం కల్పించడం హర్షణియమన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకిరెడ్డి వెంకటేశ్వర్లు, కున్సోత్ కిషన్, అజ్మీర మంగీలాల్, యువజన కాంగ్రెస్ నాయకులు మాళోత్ శివ, ఐఎన్టియూసి శివ తదితరులు పాల్గొన్నారు.


# బంజారా బిడ్డా మిము మరువదు ఈ గడ్డ






- ఎల్ హెచ్ పిఎస్ నేత భద్రూ నాయక్
- మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కు ఘన నివాళులు
- మదన్ లాల్ సంస్మరణ సభకు హాజరైన పలువురు సామాజిక ఉద్యమకారులు
- మదన్ లాల్ ఆశయ సాధనకు పాటు పడదామని ప్రతిజ్ఞ

**సి కె న్యూస్ ప్రతినిధి:**తన చివరి శ్వాస వరకు గిరిజనుల హక్కుల కోసం... గిరిజనుల సంక్షేమం కోసం... వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పరితపించిన మహా నేత, బంజారా ముద్దుబిడ్డ, వైరా మాజీ ఎమ్మెల్యే భానోత్ మదన్ లాల్ అకాల మరణం గిరిజన ఉద్యమాలకు, సమకాలిన రాజకీయాలకు తీరనిలోటని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎస్ బీ ఐ టీ విద్యా సంస్థల అధినేత ఆర్ జె సి కృష్ణ, మదన్ లాల్ సోదరుడు భానోత్ సుందర్ లాల్, డీ సి సి బి మాజీ చైర్మన్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం, మహిళా న్యాయవాది షేక్ నజీమా, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరన్న నాయక్ అన్నారు. శనివారం ఖమ్మం లోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ బద్రు నాయక్ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన వివిధ సామాజిక సంఘాల ప్రముఖులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, మహిళా సంఘాలు సహా, కవులు, రచయితలు, గాయకులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంగానూ, తాను ఎమ్మెల్యేగా లేకపోయినా ప్రజల అభివృద్ధి కోసం భానోత్ మదన్ లాల్ అలుపెరగని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రధానంగా సాధారణ పేద కుటుంబం నుంచి వచ్చిన మదన్ లాల్ ఆత్మవిశ్వాసంతో, అంచలంచలుగా ఎదిగి సమాజంలో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి తన జాతి కోసం తన జాతి సంక్షేమం కోసం శాసనసభలోను శాసనసభ బయట విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన అకాల మరణం గిరిజన ఉద్యమాలకు, దళిత, బహుజన సామాజిక వర్గాల ఐక్య పోరాటాలకు, ఆయా శ్రేణులకు తీరని లోటని వారన్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడి అనే చిన్న గ్రామం నుంచి తొలిత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎదిగారని అన్నారు. ప్రజల కోసం చేసిన ఉద్యమాల ఫలితంగా తాను కేసులపాలై సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగాన్ని సైతం రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించి కూడా ప్రజల కోసం పదవిని త్యాగం చేయాల్సి వచ్చింది అని గుర్తు చేశారు. తను ప్రాతినిధ్యం వహిస్తున్న వైరా నియోజకవర్గంలో పాటు తను పుట్టి పెరిగిన రఘునాథపాలెం మండలాన్ని సైతం అన్ని విధాలుగా సమగ్ర అభివృద్ధి చేసిన ఘనత బానోత్ మదన్ లాల్ దే అని అన్నారు. ఖమ్మం నగరం నడిబొడ్డున బంజారా భవన్ నిర్మాణానికి స్థల సేకరణ లోను, భవన నిర్మాణాన్ని చేపట్టడంలోనూ మదన్ లాల్ ఎంతో కృషి చేశారని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను ఆయన ఆలోచనలను ప్రజలలోకి తీసుకెళ్లి ఆయన గురించి చైతన్యం కలిగించడంతోపాటు ఆయన కలలుగన్న గిరిజన సంక్షేమం కోసం కృషి చేయడమే మనందరం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఆయన తనయుడు మృగేందర్ లాల్ ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఎన్నో కలలుగని నిజం చేసుకున్నారని గుర్తు చేశారు. ఆనందంగా కుటుంబంతో గడపాల్సిన సమయంలో ఆయన తిరిగినాని లోకాలకు వెళ్లడం ఆయన కుటుంబానికి తీరని నష్టమని అయినా ఆయన కుటుంబానికి మనందరం అండగా నిలుస్తామని ఒకరికొకరు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన మృతులకు మదన్ లాల్ మృతికి సూచనగా రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం మదన్ లాల్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సంస్మరణ సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరన్న నాయక్, శోభన్ నాయక్, లక్ష్మణ్ నాయక్, బీ పీ నాయక్, ఉపేంద్ర బాయి, శంకర్ నాయక్, భీముడు నాయక్, మంగ్యా నాయక్, శ్రీనివాస్ నాయక్, నెహ్రూ నాయక్, సుశీల భాయి, జ్యోతిబాయి, త్రివేణి భాయి, బహుజన ఉద్యమకారులు షేక్ నజీమా, పి రాంబాబు, నరేంద్ర, కాపు ఆదినారాయణ, లింగబోయిన లక్ష్మణ్, తిరుపతి యాదవ్, లలిత నాయక్, రవి నాయక్, గుండెపోగు అఖిల్, రావుల వెంకటేశ్వర్లు, గొట్టిముక్కల శ్రీనివాస్, సంజీవరావు, నాగేశ్వరరావు, వీరనారిమణుల ఆశయ సాధన సమితి కమిటీ నాయకురాలు స్పందన, సరోజినీ, లక్ష్మి, ఝాన్సీ, చందు, ప్రమీల, సుభద్ర, నాగేంద్ర, కవిత, లత, కోమలి తదితరులు పాల్గొన్నారు.











# 'వికసిత్ భారత్' సంకల్పంతో బీజేపీ ప్రజాసేవలో ముందంజ.

- దేశ అభివృద్ధిలో ప్రధాని మోదీ నాయకత్వం విశిష్టం.
- ప్రతి వర్గానికి న్యాయం .. కేంద్ర పాలన లక్ష్యం.
- రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు.
- భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.



**సి కె న్యూస్ ప్రతినిధి:**దేశ అభివృద్ధిలో బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, 'వికసిత్ భారత్' లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం వేగంగా ముందుకు సాగుతోందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. శనివారం నాడు నెలకొండపల్లి మండలంలో నిర్వహించిన వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయని, సేవే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని వివరించారు. దేశానికి మరింత శక్తి చేకూర్చే విధంగా 'వికసిత్ భారత్' కోసం కేంద్రం తీసుకుంటున్న చర్యలు ప్రతిఫలిస్తున్నాయని తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతరిక్ష రంగంలో భారత్ ఘనతలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని, ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలు ప్రయోగించి ప్రపంచ రికార్డు సాధించిన ఘనత ఇస్రోకి దక్కిందన్నారు. అలాగే దేశంలో మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ అయిన విక్రం ఎస్ ప్రయోగం దేశ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నిధులు జమయ్యేలా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 744 లక్షల కోట్ల రూపాయలు నేరుగా లబ్ధిదారులకు చేరినట్టు పేర్కొన్నారు. దీనివల్ల మధ్యవర్తిత్వం తొలగిపోయి, దాదాపు 23 లక్షల కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకున్నామని వివరించారు.
అలాగే, దేశం మొత్తం 5జీ నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయిందని, 99.6% జిల్లాల్లో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇది భారత్‌ను టెక్నాలజీలో శక్తిగా నిలిపే మరో ఘట్టమని పేర్కొన్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణం దేశ హిందూ సంస్కృతికి పునరుజ్జీవనం తెచ్చిందని, కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాళ్ లోక్ ప్రాజెక్టులతో భక్తి, సాంస్కృతిక ఆధ్యాత్మికతకు కొత్త దిశలు తెరవబడ్డాయని అన్నారు.
ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాట్లకు ముగింపు పలికే విధంగా శాంతి పరిరక్షణ చర్యలు తీసుకున్నామని, అఫ్స్పా చట్టాన్ని 75% ప్రాంతాల్లో ఉపసంహరించామని, ప్రాంతీయ స్థాయిలో శాంతిని నెలకొల్పామని అన్నారు. గిరిజనులకు మద్దతుగా మిషన్ ఆర్గానిక్ వాల్యూచెయిన్ ద్వారా లక్షల మంది ఆదివాసీ రైతులకు శిక్షణ, మార్కెట్ మద్దతు కల్పించామని వివరించారు.
ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 31 కోట్ల మందికి ఉచిత రేషన్ అందించామని, 4 కోట్ల పేదలకు ఇళ్లను కట్టిచ్చామని, 15 కోట్ల గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య భీమా కల్పించామని వివరించారు. ఇది పేదలకు ఆరోగ్య భద్రతను కల్పించేందుకు కేంద్రం తీసుకున్న సాహసిక నిర్ణయమన్నారు.
రైతులకు కేంద్రం అండగా నిలుస్తోందని, పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేపట్టామని, పసుపు, పప్పుదినుసుల కొనుగోళ్లలో గత పాలనలతో పోలిస్తే చాలా ఎక్కువగా చెల్లించినట్టు వివరించారు. వ్యవసాయ బీమా పథకం ద్వారా లక్షలాది రైతులకు నష్టపరిహారం అందించామని అన్నారు.
మహిళా శక్తిని ప్రోత్సహించేందుకు నారీ వందన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిందని, మహిళల రాజకీయ హక్కులను చాటేలా 33% రిజర్వేషన్ కల్పించామని తెలిపారు. అలాగే మాతృత్వ సెలవులను 26 వారాలకు పెంచినమాటను గుర్తు చేస్తూ, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కేంద్రం చట్టపరంగా గౌరవం అందిస్తోందని స్పష్టంచేశారు.
బీజేపీ పాలనలో పారదర్శకత, ప్రజల ఆర్థిక స్థిరత్వం, దేశ భద్రత, వృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని నెల్లూరు కోటేశ్వరరావు స్పష్టం చేశారు. దేశ యువతకు స్వయం ఉపాధిని అందించేందుకు స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ నేతలు మున్నా రవికుమార్, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవీందర్, ఉపేందర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎదులాపురం మున్సిపాలిటీ ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ. దుర్గా ప్రసాద్.



**సి కె న్యూస్ ప్రతినిధి:** ఖమ్మం లోని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి క్యాంప్ కార్యాలయం లో ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డ సంబంధించి ముఖ్య నాయకుల సమావేశం లో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్,క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి,నియోజక ఇంచార్జి శ్రీనివాస్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదులాపురం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా ఎలా ముందుకు వెళ్ళాలి అలాగే స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలి అని వారు ముఖ్య నాయకులకు సలహాలు మరియు సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మద్దులపల్లీ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్,రషీద్,తమ్మినేని.నవీన్, గోనె భుజంగ రెడ్డి, ఎదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం లో తల్లికి వందనం ప్రజల్లో ఆనందం సంతోషం వ్యక్తం అయింది



ఏలూరు జంగారెడ్డిగూడెం జూన్ 14 సి కే న్యూస్ తల్లికి వందనం ముగ్గురు పిల్లలకు 39,000 వారి బ్యాంకు ఖాతా పడడంతో
వారి ఆనందం పిల్లల చదువుల పట్ల మరింత బాధ్యత పెరిగింది.
ఒకే ఇంట్లో 3 గురికి తల్లికి వందనం పథకం డబ్బులు జమ కావడంతో గతంలో ఏ పార్టీ చేయనంతగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.బి
పేద కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తల్లికి వందనం పథకం సంతోషాన్నిస్తుందని అన్నారు.

జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన మరపట్ల సత్తిబాబు నాగమణి దంపతులకు ఐశ్వర్య దిలీప్ కుమార్ అలేఖ్య ముగ్గురు సంతానం అందరినీ చదివించాలి నాణ్యమైన విద్య అందించడానికి గత ప్రభుత్వంలో చాలా అవస్థలు పడాల్సి వచ్చేదని అప్పులు చేయాల్సి వచ్చేదని ఇప్పుడు తల్లికి వందనం పథకం ముగ్గురు పిల్లలకు 39,000 వారి పిల్లల శుభ్రతకు స్కూల్ మెయింటెనెన్స్ 6000 మొత్తం 45000 డబ్బులు ఊరట కలిగించిందని అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ సీఎం చంద్రబాబుకు, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు రోషన్ కుమార్ తో పాటు ఎంపీ పుట్టా మహేష్ కు విద్యార్థిని తల్లిదండ్రు కృతజ్ఞతలు తెలియజేశారుబి .

## నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక ను మర్యాదపూర్వకంగా కలిసిన......

- 7 వ వార్డ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.



ఎమ్మిగనూరు టౌన్, సి కే న్యూస్ ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక శిల్పా ఎస్టేట్ నందు గల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు నియోజవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక ను,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ ను శనివారం 7 వ వార్డ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ జేమ్స్, రాజు,ఉదయ్ మర్యాదపూర్వకంగా కలిసి 7 వ వార్డు సమస్యలను ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సల్మాన్, ప్రసాద్,విజయ్,అశోక్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి -సీఐటీయూ




ఇల్లందు నియోజకవర్గ సి కే న్యూస్ ,కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్ డీ ఏ ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా చేసే విధంగా కార్పోరేట్ శక్తులకు ఆకులంగా పనిచేస్తున్నదని అందులో భాగంగా కార్మికులు 1886 నుండి 1990 వరకు ప్రభుత్వాలు, యాజమాన్యాలతో పోరాడి తేచ్చుకున్న 44 చట్టాలను నిర్వీర్యం చేస్తూ 29 చట్టాల స్థానే నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని దానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గాలు ఐక్యమై ప్రభుత్వం మెడలు వంచి తమ చట్టాలు పునరుద్ధరించుకోవాలని సిఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి పిలుపునిచ్చారు. శనివారం ఏలూరి భవన్ లో జరిగిన సిఐటీయూ ఇల్లందు మండల కమిటీ సమావేశం కల్లేపల్లి మరియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గతనెల 20న జరగవలసిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె దేశ సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో జూలై 9కి వాయిదా పడిందని ఈ సమ్మె రాజకీయ పరిణామాలలో మార్పులు తెచ్చే చరిత్రాత్మ సమ్మె అని ఈ సమ్మెకు రైతు, వ్యవసాయ కార్మికులు సంపూర్ణంగా మద్దతు నిస్తూ గ్రామీణ హర్తాళ్ కు పిలుపు నిచ్చాయని ఆయన అన్నారు. తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన కార్మిక పని ప్రదేశాలు నివాస ప్రాంతాల్లో విరివిగా సమ్మె ప్రచారం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఈసం వెంకటమ్మ, సుల్తానా, చీమల రమణ, ఫాతిమా, ఉమాదేవి, ఈసం రాధ, చంద్రకళ, మహమూద్, కటకం రాజయ్య, భద్రు, రమేష్, నజీర్, లక్ష్మణ్ రావు, హుస్సేన్, బోయిన పద్మ, రాజ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకున్న కేసులకు శాశ్వత పరిష్కారం....

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్
- లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి




సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -14 :లోక్ అదాలత్ లో కేసును ఇరుపక్షాలు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని,
అంతిమ తీర్పుపై ఎటువంటి అప్పీల్ కు అవకాశం వుండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు.
శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ కె. ఉమా దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు లతో కలిసి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. రాజగోపాల్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని, ఎటువంటి రుసుము, సమయం వెచ్చించాల్సిన అవసరం లేదని తెలిపారు.
లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమే కాకుండా ప్రీ లిటిగేషన్ (భార్య భర్తల కేసులు, డబ్బు సంబంధించిన కేసులు, సివిల్ తగాదాలు) కూడా పరిష్కారం అవుతాయని అన్నారు. చెక్ బౌన్స్ కేసులు చర్చల ద్వారా లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు.
మోటార్ వాహన ప్రమాద కేసులు, అక్క చెల్లెల్లు, అన్నదమ్ముల కేసులు, భార్య భర్తల మధ్య వివాద కేసులను లోక్ అదాలత్ ద్వారా సెటిల్మెంట్ చేసుకోవాలని అన్నారు. న్యాయ సేవా సంస్థ కోర్టు దగ్గర రెగ్యులర్ గా అందుబాటులో ఉంటుందని, మన దగ్గర స్పెషల్ మీడియేషన్ సెంటర్, శిక్షణ పొందిన మీడియేటర్స్ కూడా ఉన్నారని, వారి సహకారంతో కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు.
లోక్ అదాలత్ ద్వారా ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల 500 సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసామని తెలిపారు. 62 మోటార్ వెహికల్ ప్రమాద కేసులలో రాజీ ద్వారా 2 కోట్ల 80 లక్షల పరిహారం ఇప్పించడం జరిగిందని అన్నారు. లోక్ అదాలత్ లో కక్షిదారులు, భీమా కంపెనీలు కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. న్యాయవాదులు వ్యవస్థలో ఒక భాగమని, వారి సహకారంతో కక్షిదారులకు మంచి తీర్పు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ను కక్షిదారులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.
బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడే పవిత్ర బాధ్యత న్యాయవాదులకు ఉంటుందని అన్నారు. న్యాయవాద సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అనవసరంగా ప్రైవేట్ సెటిల్మెంట్స్ చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన వృద్ధ మహిళ గొడ్ల రత్తమ్మ తరపున న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కేసు దాఖలు చేయగా సత్వర పరిష్కారం చేసి హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు ద్వారా 11 లక్షల 50 వేల రూపాయలకు అవార్డ్ అందజేశారు. భవాని, వీరభద్రం భార్య భర్తల వివాదానికి సంబంధించిన కేసు రాజీ ద్వారా పరిష్కరించడం జరిగింది.
అనంతరం పాత్రికేయులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కోర్టు పరిధి లోనే కాకుండా సత్తుపల్లి, మధిర కోర్టులలో కూడా జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ సూచనలు, సలహా మేరకు జాతీయ లోక్ అదాలత్ జరుపుకుంటున్నామని అన్నారు. సివిల్ కేసుల పరిష్కారానికి వీటిని వినియోగించుకోవచ్చని అన్నారు. మనకు సమయం ఆదా అవుతుందని అన్నారు. రాజీ చేసుకోవాల్సిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులకు కూడా సెటిల్ చేయడం జరుగుతుందని అన్నారు.
లోక్ అదాలత్ వల్ల ప్రజలలో మంచి వాతావరణం ఏర్పడుతుందని, వివాదాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రశాంత వాతావరణం ఉంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు.
ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కర్రి ఉమాదేవి, దేవినేని రామప్రసాదరావు, వి. శీనయ్య, యం.అర్చన కుమారి, యం. కల్పన, టి.మురళి మోహన్, కే.వి. చంద్ర శేఖర్ రావు, కాసరగడ్డ దీప, బెక్కమ్ రజని, ఏపూరి బిందు ప్రియ, వి.మాధవి, బి. నాగ లక్ష్మి, బార్ అసోసియేషన్ గద్దల దిలిప్ కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెని న్యాయవాదులు బండారుపల్లి గంగాధర్, పి. సంధ్య రాణి, కొత్తపల్లి రామారావు, స్వర్ణ రాంబాబు, మందడపు శీనివాసరావు, న్యాయ శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కోణంలో విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలి......



- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి
- కలెక్టరేట్ లో విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశాన్ని నిర్వహించిన చైర్మన్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -14:
రైతులకు మేలు చేసే కోణంలో విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు.
శనివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో నిర్వహించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నకిలి విత్తనాల కారణంగా రైతులు అనేక నష్టాలు పాలవుతున్నారని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కలిసి తెలంగాణ రాష్ట్ర పరిధిలో చట్ట ప్రకారం రైతులను ఆదుకునేందుకు విత్తన చట్టం ముసాయిదా బిల్లు తయారు చేసిందని అన్నారు.
విత్తన చట్ట ముసాయిదా బిల్లుపై రైతుల అభిప్రాయాలను తెలుసుకొని, ఎటువంటి అంశాలు చేరిస్తే రైతులకు మేలు జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు.
పత్తి, మిర్చి సాగు చేసే రైతులు చాలా కాలంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలనే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రైతులు లేబుల్ లేని విత్తనాల ప్యాకెట్లు, లూజ్ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని అన్నారు. ప్రతి జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. రైతులు అధికారులతో సమన్వయం చేసుకొని నకిలీ విత్తనాలు అరికట్టేందుకు కృషి చేయాలని అన్నారు.
రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు ఆర్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రైతు తన విత్తనం ఉత్పత్తి చేసుకొని పంటలు పండించేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. గతంలో ములుగు జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాల ద్వారా 4 వేల ఎకరాలలో పంట నష్టం జరిగితే రైతులకు 4 కోట్ల రూపాయల పరిహారం సంబంధిత కంపెనీ ద్వారా అందించడం జరిగిందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది జరిగిన రైతు సంక్షేమ కమీషన్ కు ఫిర్యాదు అందిస్తే వారి తరఫున సంపూర్ణ పోరాటం చేయడం జరుగుతుందని అన్నారు.
గతంలో పేదలు తిన్న ఆహారం నేడు ధనవంతులు తింటున్నారని తెలిపారు. వరి పంటతో పాటు పప్పు దినుసులకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం 21 వేలు ఉన్న మిర్చి పంట ఈ సంవత్సరం 12 వేలకు పడిపోయిందని, దీని వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు.
కార్యక్రమంలో న్యాయవాది సునీల్ మాట్లాడుతూ, విత్తన చట్టం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసిందని అన్నారు. ఒప్పంద వ్యవసాయం పేరిట రకరకాల సాగు జరుగుతోందని అన్నారు. కొత్త చట్టం లో రైతుల కోణంలో ఎటువంటి నిబంధనలు ఉంటే బాగుండాలో సూచనలు అందించాలని అన్నారు. విత్తనాల ప్రకటనలపై రెగ్యులేషన్ ఉండాలని, విత్తన ఉత్పత్తి రైతుల హక్కుల గురించి కూడా చట్టంలో పొందుపర్చాలని అన్నారు.
నాణ్యత లోపాల వల్ల రైతుకు నష్టం కలిగితే పరిహారం పొందే విధానం ఉండాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతు వినియోగదారుడు అవుతారని నష్టపోతే, వినియోగదారుల ఫోరం వెళ్ళవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. రైతుకు కలిగిన మానసిక శోభకు కూడా పరిహారం కోరవచ్చని అన్నారు.
రఘునాధపాలెం గ్రామానికి చెందిన రైతు రఘురాం మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు తీసుకుని వచ్చే విత్తనాల జెనెటిక్స్ పరిశీలించాలని అన్నారు. నష్ట పరిహారం పరిస్థితి రాకుండా చూడాలని, విత్తనాలను పరిశీలించి ధృవీకరణ చేసినవి మాత్రమే రైతులకు అమ్మేలా చూడాలని అన్నారు. విత్తనాల ప్యాకెట్ పై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి స్కాన్ చేస్తే ఎక్కడ పరీక్షించి సర్టిఫై చేశారు వివరాలు వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.
వైరా ప్రాంతానికి చెందిన రైతు బి. రాంబాబు మాట్లాడుతూ విత్తనాలు ఉత్పత్తి చేసే రైతులకు సంబంధిత కంపెనీలు సరిగ్గా చెల్లింపులు చేయడం లేదని, దీనిపట్ల కూడా విత్తన చట్టంలో పరిష్కారం చూపాలని అన్నారు. కంపెనీలు కొంతమంది ఏజెంట్ లకు డబ్బులు పంపితే రైతులకు పంచకుండా ఉంటున్నారని, విత్తనాల కంపెనీ నుంచి నేరుగా రైతులకు చెల్లింపులు వచ్చేలా చూడాలని అన్నారు.
మంచుకొండ ప్రాంతానికి చెందిన రైతు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని విత్తనాల కంపెనీలకు ఆర్ అండ్ డీ సెంటర్ లు ఎక్కడ ఉన్నాయో ఆన్ లైన్ లో వివరాలు అందించాలని, సంబంధిత కంపెనీ విత్తనాలు సరిగ్గా పనిచేయని పక్షంలో కంపెనీ యజమాని, డిస్ట్రిబ్యూటర్ , శాస్త్రవేత్తలపై కేసులు నమోదు చేసేలా చట్టం తయారు చేయాలని అన్నారు.
భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీలు వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు అందిస్తే పారదర్శకంగా ఉంటుందని అన్నారు. విత్తనాల ఉత్పత్తి కోసం రైతుల దగ్గరికి వస్తున్న మధ్య వర్తుల గుర్తింపు కోసం కలెక్టరేట్ లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట ను కూడా విత్తన చట్టం పరిధిలోకి తీసుకు రావాలని అన్నారు.
కొణిజెర్ల మండల వ్యవసాయ అధికారి నాగార్జున మాట్లాడుతూ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చట్టంలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఒప్పందం లేకుండా మొక్కజొన్న పంట వేయవద్దని ప్రచారం చేసినప్పటికీ కొంత మంది రైతులు నమ్మి పంట సాగు చేశారని అన్నారు. కంపెనీ ఏజెంట్లకు ఎటువంటి అర్హత ఉండటం లేదని, దీనిని మార్చాలని అన్నారు.
అనంతరం పలు రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం విత్తనాల విక్రయాల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్ వేర్ తయారు చేసి విత్తనాల ప్యాకెట్ సంబంధించి సర్టిఫికెట్ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. విత్తనాల డిస్టిబ్యూటర్ లు నిబంధనలు పూర్తి స్థాయిలో పాటించేలా కఠిన పర్యవేక్షణ తీసుకుని రావాలని అన్నారు.
ఖమ్మం డీలర్ల అసోసియేషన్ ప్రతినిధి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ ఉన్న కంపెనీల నుంచి విత్తనాలు తెచ్చి డీలర్లు అమ్ముకుంటున్నా రని, అవి సరిగ్గా పనిచేయని పక్షంలో డీలర్ల పాత్ర ఏం ఉంటుందని, లైసెన్సింగ్ విధానం సరిగ్గా లేదని అన్నారు. కంపెనీ నుంచి కాకుండా బయట నుంచి ఎక్కడైనా విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అమ్మితే అప్పుడు డీలర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు.
ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీన, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యవసాయ అధికారి వి. బాబు రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ పై హర్షం

ఏపీడబ్ల్యూజేఎఫ్ , ఉపాధ్యక్షులు కొప్పుల సాయి.

పోలవరం నియోజకవర్గం జీలుగుమిల్లి ఏలూరు సి కే న్యూస్ ఏలూరు జిల్లా జీలుగుమిల్లి పాత్రికేయవృత్తిలో పనిచేస్తూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్న వారికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది . ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చెల్లించే ఫీజులో 50 శాతం వరకు రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం సర్కులర్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు అడిగిన వెంటనే జర్నలిస్టుల సమస్యపై ప్రభుత్వం స్పందించడం ఆనందదాయకం అని కొప్పుల సాయి అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణవకాశన్ని ప్రతి జర్నలిస్ట్ సద్వినియోగ పరుచుకోవాలన్నారు.ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రైవేట్ మరియు కార్పొరేట్ స్కూల్స్ లలో విద్యనభ్యసిస్తున్న వారికి 50 శాతం ఫీజులో రాయితీ కల్పిస్తూ సర్కులర్ జారీ చేసిన ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి గారికి అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ గారికి ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు జబీర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బాలసౌరి,రాష్ట్ర కార్యదర్శి కేఎస్ శంకర్రావు, జిల్లా కమిటీ మెంబర్స్ నేలటూరి అప్పారావు, బొంతు రామారావు లకు కొప్పుల సాయి కృతజ్ఞతలు తెలిపారు.

# ఏపీలో టాలీవుడ్ కు మంచి రోజులేనా

# సీఎంతో పెద్దల భేటీ






: ఆంధ్ర ప్రదేశ్ లో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఎట్టకేలకు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఏపీ సీఎం చంద్రబాబును కలవనున్నారు. వాస్తవానికి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రిని సినీ ప్రముఖులు కలవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భం లేదు. అయితే సినీ పరిశ్రమకు చెందిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మాత్రం సినీ పెద్దలు కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. పనిలో పనిగా తెలుగు చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు. అయితే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకుందామని సినీ పరిశ్రమ పెద్దలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. త్వరలో మీరంతా సీఎం చంద్రబాబును కలవాలని సూచించారు. అయితే ఇటీవల హరిహర వీరమల్లు సినిమా విడుదల ప్రకటన వచ్చింది. అంతకంటే ముందే సినిమా థియేటర్ల బంద్ ప్రతిపాదన వచ్చింది. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రకటన వచ్చింది. చిత్ర పరిశ్రమ కోసం తాను కృషి చేస్తుంటే తనకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తారా? అంటూ పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు తర్వాత జరిగిన పరిణామాలతో ఈ నెల 15న సినీ పరిశ్రమ పెద్దలు ఏపీ సీఎం చంద్రబాబును కలిసేందుకు అపాయింట్మెంట్ తీసుకున్నారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ విస్తరించే ప్రయత్నం జరగడం లేదు. కేవలం హైదరాబాద్ కు సినిమా షూటింగులు పరిమితం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కేవలం సినిమా మార్కెట్ కు పరిమితం అయింది. విశాఖలో షూటింగులు జరుగుతున్నా హైదరాబాద్ స్థాయిలో మాత్రం సాగడం లేదు. అవుట్ డోర్ షూటింగ్ లలో భాగంగా గోదావరి జిల్లాల్లో సైతం మునుపటి మాదిరిగా జరగడం లేదు. విజయవాడ తో పాటు తిరుపతి పరిసర ప్రాంతాలు షూటింగులకు అనుకూలంగా ఉన్నా సినీ నిర్మాతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అటు విశాఖ మన్య ప్రాంతం సినిమా షూటింగులకు అనుకూలం. అయితే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరణకు ఇదే సరైన సమయం. ఎందుకంటే ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమ విస్తరణకు.. ఆ రంగ ప్రముఖులకు కీలక సూచనలు ఇస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోందిసినిమా మాధ్యమం పై ఆధారపడి వేలాది మంది బతుకుతున్నారు. అలాగే ఇదో ఎంటర్టైన్మెంట్రంగంగా ఉంది. ప్రజలకు వినోదం పంచుతోంది. అయితే సినిమాల మాటున దోపిడీ జరుగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రధానంగా సినిమా థియేటర్ల లో టికెట్ల ధరలు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్నాయి. అక్కడ లభించే కూల్ డ్రింక్స్, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలంటే సామాన్యుడికి వీలుపడదు. సెలవు రోజున సగటు చిన్న కుటుంబం సినిమాకు వెళ్తే.. జేబులో వెయ్యి రూపాయలు ఉండాల్సిందే. అంతలా బాదుడు ఉంటోంది. ఒక సినిమా పది రోజులు ప్రదర్శిస్తేనే హిట్ టాక్ వచ్చే రోజులు ఇవి. అందుకే ఆ కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుడి నుంచి బాదుడు తప్పడం లేదు. అందుకే థియేటర్లకు రాయితీలు ఇవ్వాలి. ఆపై సినిమా షూటింగులకు తగ్గట్టు ఏపీని విస్తరించాలి. స్థానిక కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఇవి చేస్తేనే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరిస్తుంది. నలుగురికి ఉపాధి దొరుకుతుంది.రాష్ట్ర విభజనజరిగి 11 సంవత్సరాలు అవుతోంది. కానీ ఇంతవరకు తెలుగు సినీ పరిశ్రమ విస్తరణ జరగలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప కార్యరూపం దాల్చలేదు. సినీ పరిశ్రమ ద్వారా తెలంగాణకు ఆదాయం వస్తుంటే.. మార్కెట్ విస్తరణకు మాత్రం ఏపీ ఉపయోగపడుతోంది. చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకు ఎవరికీ వారే సినిమా టిక్కెట్ల ధర పెంపునకు ఏపీ ప్రభుత్వ అనుమతి తీసుకుంటున్నారు. కానీ ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరించాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరణకు అవసరమైన అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కానీ ఎక్కడో ప్రయత్న లోపం జరుగుతోంది. ఆపై సినీ పరిశ్రమ నుంచి కూడా మద్దతు కరువవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబుకు సినీ పరిశ్రమ పెద్దలు కలవనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ కలయిక మర్యాదపూర్వకంగా కాకుండా.. ఏపీలో పరిశ్రమ విస్తరణ, సగటు ప్రేక్షకుడకు అదనపు బాదుడు లేకుండా వినోదం పంచడం వంటి చర్యలపై దృష్టి పెడితే ఎంతో మేలు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## అన్నీ గ్రామపంచాయితీలలో కాంగ్రెస్ గెలవాలి




రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాధపాలేం మండలంలోని 37 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని రఘునాధపాలెం మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందుకు అనుగునంగా అందరు కృషి చేయాలని . పదవులు అందరికి రావని, పని చేసే ప్రతి కార్యకర్త కాలర్ ఎగరవేసుకునేలా చేస్తానని ఏ ఒక్కరు కంగారు పడవద్దని, కష్టపడే వాళ్లకు పదవులు వచ్చే అవకాశం ఉందని భరోసా ఇచ్చారు. మీరు పదవులలో కూర్చుంటే మీరు నాకు ఇచ్చిన స్థానానికి విలువ ఉంటుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో కులగణన జరిగిందని, కులాగణన చేయగలిగిన దమ్ము ధైర్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే ఉందని, రాహుల్ గాంధీ ఆలోచనలతో దేశ ప్రధాని మోడీ కులాగణన చెయ్యక తప్పడం లేదని, రేపు కర్ణాటక లో కులగణన జరుగనుందని, ఎస్సి జనాభా నిష్పత్తి ఆధారంగా ఉద్యోగాలు కూడా ఇస్తా అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని, అభివృద్ధి గురించి నాకు గుర్తు చేయడమే అది అవ్వడం అవ్వకపోవడం నేను చూసుకుంటానని, నేను గెలిచిన తర్వాత రోజు విడిచి రోజు మీ మధ్యలో ఉంటున్నానని, నాకు మీరు ఇచ్చిన గౌరవం జన్మ జన్మలకు మర్చిపోనని, మీ గ్రామాల్లో ప్రతి గ్రామానికి మంచి నీళ్ళు ఇచ్చిన ఘనత నాదే,ఇప్పటికే 5, 6 వందల కోట్ల నిధులు తీసుకుని వచ్చా రఘునాథపాలెం మండలానికి, ఇంకా ఎన్ని వందల కోట్లు అయినా తీసుకుని వస్తానని, 21 వేల కోట్లు రైతు బంధు కింద ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకాలతో పాటు కొత్త పథకాలు కూడా అందిస్తున్నామని,

ఉద్యోగస్తులు వారి బాకీలు, వారికి 5 డీఏ లు పెండింగ్ ఉన్నాయి వారికి 10 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, అన్ని గత ప్రభుత్వం చేసి పోయిన ఘనతేనని అన్నారు. , అయిన అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళు న్నారని, మీనాక్షీ నటరాజన్ వచ్చిన నాటి నుండి కష్టపడే వారికి పదవులు ఇవ్వాలని నిర్ణయించారని, మొన్న ఇచ్చిన మంత్రి పదవులలోనూ అందరికీ అవకాశం ఇచ్చామని, పదవులు ఊరికే రావు కష్టపడే వారికే వస్తాయని అన్నారు.

మీరు ఏ గ్రామానికి రమ్మంటే ఆగ్రామానికి వస్తానని, మీరు ఐక్యంగా లేకుంటే మీ మధ్యలో బిఆర్ఎస్ వాళ్ళు గొడవ పెట్టీ వాళ్ళు ఎగేసుకుని పోతారని ముఖ్య కార్తల సమావేశంలో మంత్రి తుమ్మల అన్నారు.

## గచ్చిబౌలి లో పలు పబ్బులపై ఎస్ఓటి దాడులు

గచ్చిబౌలిలోని పలు పబ్బులపై సైబరాబాద్ ఎస్వోటీ అధికారులు దాడులు నిర్వహించారు.ఎస్ఎల్ఎన్ టెర్మనల్ మాల్ లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలను పసిగట్టే శునకాలను వినియోగంచారు. ఈ తనిఖీల్లో నలుగురికి డ్రగ్స్ పాజిటివ్ గా తేలింది. డీజీ ప్లేయర్ శివ సైతం డ్రగ్ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారించారు. రణ.

### పాలకోడేరులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పర్యటన

### అనుమతుల్లేని భవంతిని కూల్చేయాలని ఆదేశం

పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులోని మంగయ్య చెరువు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అర సెంటు స్థలంలో నిర్మిస్తున్న భవనాన్ని కూల్చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు.పాలకోడేరులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవా నికి విచ్చేసిన ఆయన పక్కనే నిర్మిస్తున్న భవనాన్ని చూసి అధికారులను ప్రశ్నించారు.గ్రామకార్యదర్శి గోపి సమాధానమిస్తూ ఈ భవనానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అయినా గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని చంద్రావతి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించేసారని తెలిపారు.

అనుమతులు లేకుండా బిల్డింగ్ నిర్మిస్తుంటే మీరేం చేస్తున్నారని రఘురామ మండిపడ్డారు. ఈ బిల్డింగును వెంటనే కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు.

## తాడిపత్రిలో హై టెన్షన్

తాడిపత్రిలో మరోసారి హై టెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రి కి రావడానికి సిద్ధమైయారు. అయనను అడ్డుకోవడానికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి,టిడిపి నాయకులు,జెసి అనుచరులు సిద్ధమయ్యారు,. ఈ నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్దకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి రాకుండా తిమ్మంపల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. నోటీసులు ఇవ్వాలని పెద్దారెడ్డి రోడ్డు పైనే బైఠాయించారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.వీఐపీ ప్రారంభ దర్శనంలో శ్రీవారిని దర్శించుకున్న పలువూరు ప్రముఖులు మంత్రి నారాయణ ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ న్ సుబ్రమణ్యన్,మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ.దర్శించుకున్నారు.దర్శనానంతరం ఆయనకి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## దమ్ముంటే నిరూపించండి వైసీపీకి లోకేష్ మరో సవాల్

తల్లికి వందనం డబ్బులో రూ.2వేలు తన ఖాతాలో పడుతున్నట్లు చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని, లేకుంటే చట్టప్రకారం ముందుకు వెళతానని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ వైసీపీకి సవాల్ విసిరారు. “తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు లోకేష్ ఎకౌంటులో పడుతున్నాయని ఫేక్ ప్రచారం చేస్తున్నారు. మీకు 24 గంటలు టైం ఇస్తున్నా.. దమ్ముంటే, అది నిరూపించండి. లేదంటే తప్పు అయిపోయిందని ఆ స్టేట్మెంట్ వెనక్కి తీసుకోండి. లేదంటే, మీ పైన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. మీ ఫేక్ ప్రచారంపై కఠినమైన చర్యలు ఉంటాయి” అని వైసీపీని మంత్రి లోకేష్ హెచ్చరించారు.

# గద్గర్ అవార్డ్స్ లో గద్దర్ మిస్సింగ్




ఏం చేసినా వివాదమే.. ఏదో ఒక లోపమే.. సోషల్ మీడియాలో రభస అవుతున్నది. ప్రధాన మీడియా దెప్పి పొడుస్తోంది. అయినప్పటికీ రేవంత్ ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది. చివరికి ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా ఉండడం లేదు.. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. ప్రభుత్వ వైఫల్యమా? విపరీతమైన నిర్లక్ష్యమా? అనేది అంతు పట్టడం లేదు .

అప్పుడెప్పుడో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నంది అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ పురస్కారాలను ఇచ్చింది లేదు. కెసిఆర్ ప్రభుత్వం మొత్తానికే ఆ అవార్డులను కోల్డ్ స్టోరేజ్ లో పడేసింది. దాదాపు దశాబ్ద కాలంగా తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం తరఫున అవార్డులు ఇచ్చింది లేదు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి పురస్కారాలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణలో వాగ్గేయకారుడుగా.. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గద్దర్ స్మృత్యర్థం అవార్డును ప్రకటించారు రేవంత్ రెడ్డి. గద్దర్ పేరు మీద ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ నటినటులకు, సాంకేతిక నిపుణులకు, ఇతర బృందాలకు పురస్కారాలను అందిస్తామని వెల్లడించారు. అంతేకాదు అవార్డుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సినీ నటి జయసుధ, ప్రఖ్యాత నిర్మాత దిల్ రాజులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటీనటులు, ఇతర సాంకేతిక బృందాలకు అవార్డులను ప్రకటించింది ప్రభుత్వం. శనివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ప్రభుత్వం చేసిన తప్పు వివాదంగా మారింది. సోషల్ మీడియాలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.గద్దర్ అవార్డుల ప్రధానోత్సవానికి సంబంధించి ముద్రించిన ఆహ్వాన పత్రికలో రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు ఫోటోలను మాత్రమే ప్రచురించారు. గద్దర్ అవార్డుకు సంబంధించిన ప్రతిమను కూడా అందులో ప్రముఖంగా చూపించారు. అయితే టీజీఎఫ్ఏ పేరుమీద ఈ ఆహ్వాన పత్రికను ముద్రించారు. అయితే ఈ ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటోను ముద్రించడం మర్చిపోయినట్టున్నారు. ఆహ్వాన పత్రిక ఒక్కసారిగా వెలుగులోకి రావడంతో వివాదం మొదలైంది. అసలే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి.. బజార్లో నిలబెట్టడానికి భారత రాష్ట్ర సమితి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈలోగా ఈ ఆహ్వాన పత్రిక విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి నెగిటివ్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.. ఇన్నేళ్లపాటు అవార్డులు ఎందుకు ఇవ్వలేదు? అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోయి%ౌ% అధికారంలో ఉన్నప్పుడు గద్దర్ కు అపాయింట్మెంట్ ఇవ్వని విషయాన్ని పక్కనపెట్టి.. రేవంత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది.అయితే ఇంత జరుగుతున్నప్పటికీ.. ఇంతలా నెగటివ్ ప్రచారం చోటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం తరపునుంచి ఇంతవరకు ఒక్కరు కూడా మాట్లాడలేదు. అఫ్ కోర్స్ ఇటీవల

కాలంలో భారత రాష్ట్ర సమితి ఎన్ని రకాలుగా ఆరోపణలు చేసినా.. ఏ స్థాయిలో విమర్శలు చేసినా.. కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన ఉండటం లేదు.

ఆ పార్టీలో అధికార ప్రతినిధులు ఉన్నామంటే ఉన్నారు. పదవుల కోసం పైరవీలు చేయడం తప్ప.. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప.. వారు పార్టీ కోసం చేస్తున్నది ఏమీ లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇక ఎప్పటి లాగానే భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియాలో రెచ్చిపోతోంది. యధావిధిగా కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉండిపోతుంది. పాపం చేసింది కూడా చెప్పుకోలేని దుస్థితి కాంగ్రెస్ పార్టీది. చేసే పనిలో ఫర్ఫెక్షన్ వదిలేసి వివాదాల పాలయ్యే దారుణం ఆ నాయకత్వానిది.. పాపం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఎప్పుడు తన తప్పులు సరిదిద్దుకుంటుందో.. ఎప్పుడు వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా చూసుకుంటుందో..

CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

## ఆయుష్షు మూలం మనసులోనే

దీర్ఘాయువు రహస్యం మనసులోనే దాగుందా? 115 ఏళ్ల వయసుతో ప్రపంచంలోనే అతి ఎక్కువకాలం జీవించి ఉన్న మహిళగా రికార్డు సృష్టించిన ఎథెల్ కేటర్‌హ్యామ్ ఇదే సూచిస్తున్నారు. వాదించక పోవటం.. ఎదుటివారు చెప్పింది విన్నా నచ్చింది చేయటమే తన దీర్ఘాయువు సూత్రమన్నది ఆమె నమ్మకం. ఇది మామూలు విషయంగా అనిపించినా ఇందులో ప్రశాంతత, ఆత్మ గౌరవం ధ్వనిస్తుండటం గమనార్హం. భావోద్వేగాల అదుపుతోనే ఇది సాధ్యం. దీనికీ దీర్ఘాయుష్షుకూ సంబంధం ఉంటుండటం మరింత విశేషం.

శారీరకంగా జబ్బులు లేకపోవటమే కాదు. మానసికంగానూ బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు. అప్పుడే చురుకుగా, హాయిగా జీవితాన్ని ఆస్వాదించగలం. కుటుంబ, సామాజిక సంబంధాలతో ఉన్నతిని సాధించగలం. ఇక్కడే భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రోజూ మనకు ఎన్నో భావాలు కలుగుతుంటాయి. అవి అంతటితోనే ఆగిపోవు. ఉద్వేగాలనూ కలిగిస్తాయి. అన్నిసార్లూ ఇవి సానుకూలంగానే ఉండకపోవచ్చు. ప్రతికూల భావోద్వేగాలూ మనసును అతలాకుతలం చేస్తుండొచ్చు. ఉదాహరణకు- పరీక్షలో ఫెయిల్ అయ్యారనుకోండి. లేదూ కోరుకున్న ఉద్యోగం దొరకలేదనుకోండి. మనసంతా విచారంతో నిండిపోతుంది. కొందరు దీన్ని తేలికగా తీసుకోవచ్చు. అంతటితోనే ముగింపు పలకొచ్చు. కొందరు విపరీతంగా స్పందించొచ్చు. నిరాశా నిస్పృహలకు లోనుకావొచ్చు. ఇలాంటి ప్రతికూల భావాలను, వీటికి స్పందించే తీరును సమన్వయం చేసుకోవటమే భావోద్వేగ నైపుణ్యం. అంటే భావాలను అర్థం చేసుకొని, వాటిని సమర్థంగా అదుపులో ఉంచుకోవటమన్నమాట. స్వీయ చైతన్యం కలిగుండటం, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కొనే సామర్థ్యమూ దీనిలోని భాగమే. ఇది మానసిక ఆరోగ్యం మీదే కాదు, శారీరక ఆరోగ్యం మీదా ప్రభావం చూపుతుంది.

**ఆయుర్దాయానికి దన్ను ఇలా..**

మనం ఆయుష్షును చాలావరకూ శారీరక ఆరోగ్యంతోనే ముడిపెట్టి చూస్తుంటాం. కానీ మానసిక ఆరోగ్యమూ గణనీయ పాత్ర పోషిస్తుంది. మానసికంగా బాగున్నవారు మరింత ఎక్కువ కాలం.. హాయిగా జీవించే అవకాశమున్నట్టు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇందులో భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం అడుగడుగునా సాయం చేస్తుంది. ఇంతకీ ఇదెలా ఆయుష్షును పెంచుతుంది?

**ఒత్తిడి దూరం:** భావోద్వేగాల అదుపుతో కార్టిజోల్ వంటి ఒత్తిడి హార్మోన్ల మోతాదులు, ప్రభావాలు తగ్గుతాయి. ఫలితంగా కుంగుబాటు, ఆందోళన, భయాల వంటివీ తగ్గుముఖం పడతాయి. ఇది గుండె, మెదడు వంటి కీలక అవయవాలకూ మేలు చేస్తుంది. తరచూ కుంగుబాటు వంటి వాటికి గురయ్యేవారికి గుండెపోటు, పక్షవాతం ముప్పులు 6 రెట్లు ఎక్కువ. భావోద్వేగాల అదుపుతో వీటి ముప్పు తగ్గుతుంది. పరోక్షంగా ఆయుర్దాయమూ పెరుగుతుంది.

**రోగనిరోధక బలం:** మానసిక దృఢత్వంతో రోగనిరోధక వ్యవస్థ కూడా మెరుగవుతుంది. వీరిలో యాంటీబాడీలను తయారుచేసే టి కణాల వంటివి చురుకుగా పనిచేస్తాయి. అందువల్ల బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పు తక్కువ. ఇన్‌ఫెక్షన్లు దాడిచేసినా సమర్థంగా ఎదుర్కోగలుగుతారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారు జబ్బుల నుంచి 1.14 రెట్లు ఎక్కువ వేగంగా కోలుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

**వాపు ప్రక్రియ తగ్గుముఖం:** కణ అంతర్గత వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తగ్గటం మరో ముఖ్య విషయం. దీంతో మధుమేహం, అల్జీమర్స్, క్యాన్సర్ల వంటి జబ్బులు వచ్చే అవకాశమూ తగ్గుతుంది.

**జీవనశైలి:** మానసికంగా బాగున్నవారు వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తినటం వంటి మంచి జీవనశైలిని పాటిస్తుంటారు. ఇది మొత్తంగా ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

**సర్దుబాటు సామర్థ్యం:** భావోద్వేగ నైపుణ్యం మూలంగా ఇతరులతో సర్దుకుపోయే స్వభావమూ మెరుగవుతుంది. దీంతో ఇంటా బయటా కలివిడితనం ఇనుమడిస్తుంది. కుటుంబ, స్నేహ సంబంధాలూ పెరుగుతాయి. ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో రాణించటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తారు. ఇవి మరింత మానసిక దృఢత్వానికీ తోడ్పడతాయి. ఇలా ఇదొక సానుకూల వలయంగా ప్రయోజనం కలిగిస్తుందన్నమాట.

**భావోద్వేగ నైపుణ్యాన్ని సాధించేదెలా?**

**అవగాహన:** భావోద్వేగాలను గుర్తించటం, అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. అప్పుడే వీటిని అదుపులో ఉంచుకోవటానికి, పైచేయి సాధించటానికి మార్గం సుగమమవుతుంది. ఉదాహరణకు- ఇంతకుముందు ఎవరి మీదైనా కోపాన్ని ప్రదర్శించినప్పుడు ఎలాంటి అనుభవం ఎదురైంది? వాళ్లు ఎలా బాధపడ్డారు? తమకు ఎంత క్షోభ కలిగింది? అనేవి అవగతమైతే ముున్ముందు భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవటానికి వీలుంటుంది.

**దయ, కరుణ:** మన చేతుల్లో లేనివాటికి చింతిస్తే ప్రయోజనం లేదు. దీంతో భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. కాబట్టి తమను తాము దయతో చూసుకోవటం, బలాలు, బలహీనతలను గుర్తించటం.. తమను తాము క్షమించుకోవటం సాధన చేయాలి.

**అన్యోన్య అనుబంధాలు:** ఇవి ఒడుదొడుకుల్లో తమకు ఒకరు తోడున్నారనే భరోసా ఇస్తాయి. ధైర్యంగా ముందుకు సాగేలా ప్రోత్సహిస్తాయి. మానసిక సమతుల్యత చేకూరుస్తాయి. భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యమూ అబ్బుతుంది.

**లక్ష్య సాధన:** జీవితంలో ఏదో ఒక ఆశయం, లక్ష్యం పెట్టుకోవటం.. దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంటే తృప్తి కలుగుతుంది. పెద్ద పెద్ద లక్ష్యాలే కానక్కర్లేదు. చిన్నవైనా సరే. వీటిని క్రమంగా సాధిస్తుంటే ఆత్మ విశ్వాసం, నిబ్బరం ఇనుమడిస్తాయి.

**ధ్యానం:** గాఢంగా, లయబద్ధంగా శ్వాస తీసుకుంటూ చేసే ప్రాణాయామం, మనసు మీద దృష్టిని నిలిపే ధ్యానం ఎంతో మేలు చేస్తాయి. ఇవి ప్రతికూల ఆలోచనల నుంచి మనసును మళ్లించి సానుకూల భావాలు పెంపొందేలా చేస్తాయి.

**డైరీ రాయటం:** తాము ఎదుర్కొన్న ఘటనలను డైరీలో రాసుకుంటే ఎప్పుడెలా ప్రవర్తించామో అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. అసమంజసంగా స్పందించటాన్ని తెలుసుకోవటానికి, ముున్ముందు అలా ప్రవర్తించకుండా ఉండటానికి దోహదం చేస్తుంది.

**సృజనాత్మక కళలు:** సంగీతం, చిత్ర లేఖనం, చేత్తో బొమ్మలు చేయటం వంటి సృజనాత్మక కళలు మనసులోని భావాలను బయటకు వెల్లడించటానికి, భారం తగ్గటానికి తోడ్పడతాయి. ప్రతికూల భావోద్వేగాలు క్రమంగా సానుకూలంగా మారతాయి.

**సమయ పాలన:** పనులను ఆయా వేళల ప్రకారం చేయటం, సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవటం మరో మంచి పద్ధతి. ఇది అనవసరంగా ఆదుర్దా పడకుండా, భావోద్వేగాలు గతి తప్పకుండా చూసుకోవటానికి తోడ్పడుతుంది.

**ఓపెన్ మైండ్:** అవతలివారి కోణాన్ని వినటం వల్ల అభిప్రాయ భేదాలను గుర్తించటానికి వీలవుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పకుండా చూసుకోవచ్చు. ఎదుటి వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వటం ద్వారా వ్యక్తిగత దూషణలకు దిగకుండా చూసుకోవచ్చు.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు

వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.



**రక్తపోటు**

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40-50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.

**టైప్ 2 మధుమేహం**

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఆస్టియో పోరోసిస్**

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన పడుతుంటారు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

**బవెల్ కేన్సర్**

దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



**35 శాతం మందికి బీపీ**
**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**
**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా ఫలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.

# వాళ్లు బ్రెయిన్ వాష్ చేయడం వల్లే మళ్లీ ఇండస్ట్రీకి వచ్చా



చైల్డ్ ఆర్టిస్ట్ నిత్యా శెట్టి అందరికీ పరిచయస్తురాలే. కోడి రామకృష్ణ తెరకెక్కించిన దేవుళ్లు సినిమాలో బాల నటిగా నటించి ఎంతో మంచి ప్రశంసలు అందుకున్న నిత్యా ఆ తర్వాత లిటిల్ హార్ట్స్, దాగుడు మూతలు దండాకోర్ తో పాటూ పలు సినిమాల్లో నటించింది. ఆ తర్వాత హీరోయిన్ గా మారి నువ్వు తోపురా, ఓ పిట్టకథ లాంటి సినిమాలు చేసింది.తెలుగులో పాటూ కోలీవుడ్ లో కూడా నిత్యా సినిమాలు చేసింది. అక్కడ కూడా బాలనటిగా కొన్ని సినిమాలు చేసింది. చిన్నప్పుడు బాలనటిగా పలు సినిమాలు చేసిన నిత్యా ఆ తర్వాత చదువుల కోసం తన యాక్టింగ్ కెరీర్ కు ఫుల్ స్టాప్ పెట్టింది. బాగా చదివి జాబ్ కూడా చేసిందట. ఈ విషయాన్ని స్వయంగా నిత్యా శెట్టి రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది.తాను చిన్నగా ఉన్నప్పుడు మొదట్లో డాక్టర్ అవాలనుకుందట నిత్యా. కానీ తన చుట్టాల్లో ఒక డాక్టర్ ఉన్నారట. అతను డాక్టర్ అంటే లైఫ్ లాంగ్ చదువుతూనే ఉండాలని చెప్పడంతో దాన్ని వదిలేసి బిటెక్ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చేశానని చెప్పింది. చదువయ్యాక కూడా తనకు యాక్టర్ అవాలనే ఆసక్తి కానీ, ఆలోచన కానీ లేదని నిత్యా శెట్టి తెలిపింది.అందుకే స్టడీస్ అయిపోయాక ఇన్ఫోసిస్ లో జాబ్ వస్తే మైసూర్ వెళ్లి జాబ్ లో జాయిన్ అయ్యానని, జాబ్ చేస్తూనే ఇస్రో ఎగ్జామ్ కూడా రాసి పాసయ్యానని, ఇస్రోలో ఆఫర్ వస్తే వద్దనుకుని ఇన్ఫోసిస్‌లోనే ఉండిపోయానని, ఇన్ఫోసిస్ లో ఎంప్లాయ్ అవార్డ్స్ కూడా అందుకున్నానని, అక్కడ ఆఫీస్ లో ని కొలీగ్స్ నువ్వు ఒకప్పుడు ఆర్టిస్టువి కదా సినిమాలు చేసుకోవచ్చు కదా అని బ్రెయిన్ వాష్ చేయడంతో జాబ్ కు రిజైన్ చేసి ఇండస్ట్రీకి వచ్చానని చెప్పుకొచ్చింది నిత్యా.




చాందిని తమిళరసన్ కొత్త ఫోటోలలో అందంగా కనిపిస్తోంది



త్రిష కృష్ణన్ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో అందంగా కనిపిస్తో

## త్రిప్తి కోసం టాలీవుడ్ ఎదురు చూపులు..!



బాలీవుడ్ లో కొన్ని సినిమాలు చేసినా సరే యానిమల్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది త్రిప్తి డిమ్రి. ఒక్క సినిమాతో అమ్మడి ఫేట్ మారిపోయింది. బీ టౌన్ హాలిలిట్ బ్యూటీల్లో ఒకరుగా ఆమె సూపర్ ఇమేజ్ తెచ్చుకుంది. యానిమల్ తో కెరీర్ లో జోష్ పెంచుకున్న త్రిప్తి డిమ్రి ఆ నెక్స్ట్ వరుస ఛాన్స్ లు అందుకుంటుంది.

ఇప్పటికే బాలీవుడ్ లో 3 సినిమాల దాకా చేసిన త్రిప్తికి టాలీవుడ్ నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తుంది. ఆల్రెడీ సెట్స్ మీద ఉన్న సినిమాల కోసం కూడా త్రిప్తిని హీరోయిన్ గా అడుగుతున్నారట.

ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాకు త్రిప్తిని తీసుకునే అవకాశం ఉందని టాక్. అదే కాకుండా మరో రెండు సినిమాల్లో కూడా త్రిప్తికి ఛాన్స్ ఇస్తున్నట్టు ఫిం నగర్ టాక్. అందులో ఒకటి పాన్ ఇండియా సినిమా అని తెలుస్తుంది. త్రిప్తి డిమ్రి తెలుగు ఎంట్రీ కోసం ఆమె ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. యానిమల్ సినిమాతో ఆమెకు వచ్చిన హాలిలిట్ ఇమేజ్ ని కొనసాగించాలని చూస్తుంది త్రిప్తి.టాలీవుడ్ నుంచి వచ్చిన ఆఫర్స్ కూడా తన గ్లామర్ షో కోసమే అన్నట్టుగా తెలుస్తుంది. త్రిప్తి స్కిన్ షోకి తెలుగు ఆడియన్స్ కూడా ఫిదా అయ్యారు. యానిమల్ తో ఆమె సోషల్ మీడియా ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. అంతేకాదు ఆమె చేస్తున్న బాలీవుడ్ సినిమాలకు కూడా సూపర్ బజ్ వస్తుంది. ఇక అమ్మడి ఫోటో షూట్స్ అయితే నెక్స్ట్ లెవెల్ అనిపిస్తాయి. కీరీర్ పరంగా యానిమల్ తో వచ్చిన ఈ హైప్ ని ఏమాత్రం తగ్గకుండా జాగ్రత్త పడుతుంది త్రిప్తి డిమ్రి.

తెలుగు ఎంట్రీ ఇస్తే మాత్రం అమ్మడికి ఇక తిరుగు ఉండదని చెప్పొచ్చు. కచ్చితంగా త్రిప్తి టాలీవుడ్ లో టాప్ ప్లేస్ కి వెళ్లే ఛాన్స్ ఉంటుంది. ప్రస్తుతానికి తారక్ నీల్ సినిమాలోనే అమ్మడి పేరు వినిపిస్తుండగా నెక్స్ట్ రాబోతున్న సినిమాల డీటైల్స్ కూడా త్వరలో తెలుస్తాయి. త్రిప్తి ఏం చేసినా సరే ఆమె ఫ్యాన్స్ ఖుషి అవుతున్నారు. అమ్మడి ఫోటో షూట్స్ కి బీభత్సమైన ఫ్యాన్స్ ఉండగా సౌత్ సినిమాల్లో అమ్మడి హవా మొదలైతే మాత్రం పాన్ ఇండియా లెవెల్ లో త్రిప్తి పేరు మారుమోగేలా ఉంటుందని అంటున్నారు.